


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 13-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 185 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ప్రెస్ అకాడమీ ఛైర్మన్

## వాసుదేవ దీక్షితులు మృతి

- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- జర్నలిస్టు సంఘాల సంతాపం



అమరావతి: ప్రముఖ పాత్రికేయుడు వాసుదేవ దీక్షితులు కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం (ఏప్రిల్ 14) తుది శ్వాస విడిచారు. జర్నలిస్ట్ వాసుదేవ దీక్షితుల మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి తరువాయి 2లో..

## మోదీకి రష్యన్ అవార్డు



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆంద్రూ ది అపాజిల్ అవార్డును ఈ ఏడాది భారత ప్రధాని మోదీకి ఇవ్వనున్నట్లు రష్యా రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆంద్రూ ది తరువాయి 2లో..

### ఓటింగ్ శాతం తగ్గించేందుకు తెదేపా

# కుట్ర చేసింది



- ఈవీఎంలపై సీఎం వ్యాఖ్యలు బాధాకరం
- వైకాపా ఓటర్లకు కృతజ్ఞతలు
- వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి

హైదరాబాద్: ఎన్నికలు సజావుగా జరగకుండా చేసేందుకు, ఓటింగ్ శాతం తగ్గించేందుకు తెదేపా నేతలు కుట్రలు పన్నారని వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. గురువారం రాత్రి ఆయన హైదరాబాద్ లోటస్ పాండ్‌లో మీడియాతో మాట్లాడారు. 80 శాతం పైచిలుకు ప్రజలు బ్రహ్మాండగా ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కృషిచేసిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. అనేక ఆటుపోట్లు తట్టుకొని పార్టీ తరుపున నిలబడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఏ పార్టీకి తాము ఓటు వేసింది ప్రజలు స్పష్టంగా వీవీప్యాట్ ద్వారా చూడగలిగారని, అలాంటి తరుణంలో ఈవీఎంలపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఎన్ని సీట్లు వస్తాయని భావిస్తున్నారన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు జగన్ స్పందించారు.

ప్రజల దయ, దేవుడి ఆశీస్సులతో వైకాపా అఖండ విజయం సాధించబోతోందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- బాలికలదే హవా .. ప్రథమ సంవత్సరంలో 60 శాతం
- ద్వితీయ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణత
- ఫలితాల్లో కృష్ణా జిల్లా టాప్




అమరావతి: ఏపీ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు శుక్రవారం విడుదల య్యాయి. ఇంటర్ విద్యామండలి కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఫలితాలను విడుదల చేశారు. తొలిసారిగా గ్రేడింగ్ విధానంలో ఈ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో తరువాయి 2లో..

### సుప్రీం తీర్పుపై

# రివ్యూ పిటీషన్ వేస్తా

ఈవీఎంల మొరాయింపుపై ప్రశ్న .. ఎంపీలు, ఎమ్మెల్యేలతో ధర్నా చేస్తా

నేడు ఢిల్లీకి చంద్రబాబు పయనం



అమరావతి: వీవీప్యాట్ల లెక్కింపుపై సుప్రీం తీర్పు వ్యవహారంలో రివ్యూ పిటిషన్ వేస్తానని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం నేడు ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఏపీలో ఎన్నికల నిర్వహణపై ఈసీఐని ప్రశ్నించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ఈవీఎంల మొరాయింపు సమయంలో వాటిని సరిచేసేందుకు వచ్చిన సాంకేతిక నిపుణులు ఎవరు? వారికి ఉన్న అర్హతలేంటో చెప్పాలని ఈసీని డిమాండ్ చేయనున్నట్లు చంద్రబాబు తెలిపారు. వారిని ఎలా నియమించారని ప్రశ్నించనున్నట్లు పేర్కొన్నారు. వీవీప్యాట్ల మొత్తం లెక్కింపునకు తరువాయి 2లో..

## అవినీతి నిర్మూలనే లక్ష్యం

### కొత్త పురపాలక చట్టంపై కేసీఆర్ రూపకల్పన




హైదరాబాద్: నూతన పురపాలక చట్టం రూపకల్పనపై తెలంగాణ సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి.. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా కొత్త పురపాలక చట్టం తీసుకొస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందేలా కొత్త పురపాలక చట్టం రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఇప్పటికే పంచాయతీ రాజ్ నూతన చట్టాన్ని తీసుకొచ్చారు. అందుకనుగుణంగా కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడంతో పాటు పంచాయతీలకు అధికారాలు, బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అదే రీతిలో తరువాయి 2లో..

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఆదివారం భద్రాద్రి సీతారాముల కల్యాణం .. సోమవారం పట్టాభిషేకం



భద్రాచలం: భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, గరుడ సేవ, ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి తిరు కల్యాణోత్సవం, సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి మహా పట్టాభిషేకోత్సవం జరగనున్నాయి. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీ సీతారాముల కల్యాణం జరగనుంది. హరహర క్షేత్రం శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో కల్యాణోత్సవం కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి ఎదుర్కోలు, ఉదయం 9:50 గంటల నుంచి శ్రీసీతారామ కల్యాణ క్రతువు, సాయంత్రం 4:20 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 7:30 గంటలకు స్వామివారి డోలోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భక్తులు విరివిగా పాల్గొంటారు.




## నెత్తురోడిన రహదారులు

మూడు వేర్వేరు ప్రమాదాల్లో 12 మంది దుర్మరణం



అనంతపురం/ కర్నూలు/ సంగారెడ్డి: తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాల్లోని రోడ్లు నెత్తుటి మరకలతో తడిచాయి. ఈ మూడు దుర్ఘటనల్లోనూ వాహన చోదకుల తప్పిదాలే ప్రాణాలు తీశాయి. మూడు ప్రమాదాల్లో మరో పది మందికి పైగా గాయపడ్డారు.

**అనంతలో ఏడుగురు..**

తనకల్లు: అనంతపురం జిల్లాలో తరువాయి 2లో..



# ఇంటర్ ఫలితాల్లో ఎబిఎం కళాశాల విజయభేరి



నర్సీపట్నం : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎబిఎం కళాశాల విద్యార్ధులు విజయభేరి మ్రోగించారు. ప్రథమ సంవత్సరం ఎంపిటిసిలో వి.పవన్‌రాజ్‌ఖుమార్ (9.83), ఎం.శివసత్యమహేష్(9.83), పి.వాసవీప్రియ (9.83), ఎల్.దుర్గ(9.67), వివిఎల్.ప్రసన్నకుమారి(9.50), కె.దేవీప్రసన్న(9.17), బైపిసిలో జి.జ్ఞానేశ్వరి(9.67), ఎ.ప్రసన్న(9.0), సిఇసిలో జి.కుమార్(7.8), టి.సురేష్(7.8), ఎం.రాము(7.8), ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో పి.భవ్యశ్రీ(9.57), ఆర్.ధనలక్ష్మి(9.53), వి.వరద.వీలత(9.44), జి.ఆనందసాయికృష్ణ(9.29), బైపిసిలో టి.జ్యోతిప్రసన్న(9.74), కె.ప్రశాంతికుమారి(9.67), ఎస్.జయ(9.49), డి.వెంకటలక్ష్మి(9.40), కె.శ్రీనివాస్(9.40), ఎస్.దేవి(9.15), సిఇసిలో జి.ప్రసాద్(9.5), టి.నాగార్జున(8.1) సాధించారు. వీరితో పాటు అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, కళాశాల కరస్పాండెంట్ అంకంరెడ్డి జమీలు అభినందించారు.

# రావణరాజ్యం వద్దని.. రామరాజ్యం కోరుకున్నారు



విశాఖపట్నం : రావణరాజ్యం వద్దని.. రామరాజ్యమే కావాలని ప్రజలు కోరుకున్నారని తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి.రామ్ హోటల్ దస పల్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ ఈసారి ఓటింగ్ శాతం పెరగడంతో టిడిపికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిం దని చెప్పారు. ఎపిలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా విఫలము అయిం దని తెలిపారు. ఇవిఎంలు మొరాయించిన సమయంలో వాటిని సరి చేసేందుకు వచ్చిన సాంకేతిక నిపుణులు ఎవరు? చంద్రబాబు సంక్షేమ పాలనను మళ్లీ ప్రజలు కోరుతున్నారని, మధ్యాహ్నం నుండి జరిగిన పోలింగ్‌లో అత్యధికంగా ఓటర్లు టిడిపికే మొగ్గు చూపారన్నారు. చంద్రబాబు విజయం సాధిస్తారనే వైసిపి నాయకులు కుట్ర పన్ని విఫలమయ్యారని వెల్లడించారు. వైకాపా అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడీకి, కెసిఆర్‌కి తాకట్టు పెట్టారని విమర్శించారు. మోడీ హఠావో.. దేశ్‌కి బచావో అన్న నినాదాన్ని చంద్రబాబునాయుడు ఇతర రాష్ట్రాల ముందుకు తీసుకువెళ్తున్నారని, మోడీతో జత కట్టిన జగన్‌కు తెలుగు ప్రజలు గుణపాఠం చెప్పారని రామ్ తెలిపారు. 110 సీట్లు టిడిపికి రాబోతుందని, 58 సీట్లు వైసిపికి, 7 సీట్లు జనసేనకు వస్తాయని రామ్ జోస్యం చెప్పారు. టిడిపి గెలుపుతో ఎలాగో వైసిపి భూస్థాపితం అవుతుందని, ఇప్పటికైనా రాష్ట్ర పాలనలో అనుభవం లేని జగన్, అనుభవజ్ఞులైన చంద్రబాబు వద్ద నేర్చుకొనివస్తే బాగుం టుందని రామ్ దుయ్యబట్టారు. టిడిపి గెలుపుతో ఎలాగో వైకాపా భూస్థాపితం అవుతుందని, ఇప్పటికైనా రాష్ట్ర పాలన అనుభవం లేని జగన్, అనుభవజ్ఞులైన చంద్ర బాబు వద్ద నేర్చుకొని వస్తే బాగుంటుందని దుయ్యబట్టారు. కేంద్రంలో కూడా చంద్రబాబు చెప్పే వ్యక్తే ప్రధాని అవుతారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఎం.సురేష్ బాబు, పేడాడ రమణ, టి.సంతోష్, వి.వంశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యావచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి. సత్య నారాయణ ఆద్వర్యంలో చల్లపల్లి. ప్రసాద్ శర్మ, కోంపెల్ల. మూర్తి కుచిబోట్ల.ప్రసాద్ మరియు వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసి ఈరంకి. జగన్నాధరావు,దేవస్థానం పాలక మండలి సభ్యులు కొత్త. కొండబాబు, ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనం తరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేశారు.

# ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 96 శాతం ఉత్తీర్ణత

గొలుగొండ : సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2018-2019 ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 96శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి 72 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 69 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. గ్రేడుల్లో ఎ2-1, బి1-23, బి2-30, సి1-15 గ్రేడు వారీగా విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 50 మంది ఉత్తీర్ణథ సాధించినట్లు తెలిపారు. గ్రేడుల వారీగా ఎ2-4, బి1-12, బి2-19, సి1-12, సి2-2, డి1-1 సాధించినట్లు తెలిపారు.

# ఇంటి పన్నుల తగ్గింపుపై చర్చనీయాంశం హర్షణీయం



నర్సీపట్నం : ఇంటి పన్నులు తగ్గింపు విషయం ప్రధానంగా చర్చనీయాంశం అవ్వడం హర్షణీయమని నర్సీపట్నం పౌర సంక్షేమ సంఘం, ట్యాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులు, కె.శివనారాయణరాజు అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మా ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత పన్నులు తగ్గిస్తామని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్ధులైన చింతకాయల అయ్యన్నపాత్రుడు, పెట్ల ఉమాశంకరగణేష్ హామీ ఇవ్వడం ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్ సాధించిన మొదటి విజయంగా భావిస్తున్నామన్నారు. నర్సీపట్నంలో ఇంటి పన్నులు తగ్గించడమే కాకుండా పన్నులు మదింపును పున:సమీక్షించి అనేక అవకతవకలను సరి చేయాలన్నారు. పన్నులు తగ్గింపుతో పాటు మంచినీరు, డ్రైనేజీ రోడ్డు వైండింగ్, లింక్ రోడ్లు సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

అనేక కులాలు, మతాలు, జాతులు ఎంతో ఐక్యత ఉన్న నర్సీపట్నంలో ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఇదే వాతావణం కొనసాగాలని కోరారు. పన్నులు తగ్గింపుకు కృషి చేస్తామన్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు వారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జోగినాయుడు పాల్గొన్నారు.

# ఈ.వి.ఎం.లను భద్రపర్చిన స్ట్రాంగు రూంలకు మూడంచెల భద్రత

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలలో కురుపాం అసంబ్లీ స్థానంలో 77.38 శాతం,పార్వతీపురం అసంబ్లీ స్థానంలో 76.78 శాతం,సాలూరు అసంబ్లీ స్థానంలో 79 శాతం, బొబ్బిలిఅసంబ్లీ స్థానంలో 79.27 శాతం, చీపురుపల్లి అసంబ్లీ స్థానంలో 83.06శాతం, గజపతినగరంఅసంబ్లీ స్థానంలో 86.73 శాతం,నెల్లిమర్లఅసంబ్లీ స్థానంలో 87.79 శాతం, విజయనగరం అసంబ్లీ స్థానంలో 70.88శాతం, ఎస్.కోట అసంబ్లీ స్థానంలో 85.69శాతం మొత్తం 80.65 శాతం పోలింగ్ జరిగిందని జిల్లా ఎన్నికల విభాగం తెలిపింది.విజయనగరం పార్లమెంటరీ స్థానానికి ఎచ్చర్లలో 84.30 శాతం.రాజాం 73.85 శాతం.బొబ్బిలి 79.27 శాతం. చీపురుపల్లిలో 83.06 శాతం, గజపతినగరంలో 86.73 శాతం, నెల్లిమర్ల 87.79 శాతం, విజయనగరంక్ష 70.58 శాతం మొత్తం 80.58 శాతం పోలింగ్ అయిందని తెలిపారు.

## శ్రీక్షేత్రమ్‌లో గజలక్ష్మీకి ప్రత్యేక పూజలు



విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం గజలక్ష్మికి ప్రత్యేక పూజలు గావించారు. దేవాలయం అర్చకులు చామర్తి నరసింహాచార్యులు (రమేష్) ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ లక్ష్మిదేవికి స్నపనము, పంచామృతాభిషేకాలు, అర్చన గావించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ, ప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రెస్ అకాడమీ ఛైర్మన్ వాసుదేవ దీక్షితులు మృతి

చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రభుత్వం దీక్షితులను ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా నియమించింది.

1967లో ఆంధ్రప్రభ దినపత్రికలో జర్నలిస్ట్‌గా దీక్షితులు తన కెరీర్ ప్రారంభించారు. అనంతరం 1999 వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. పత్రికా రంగంలో విశ్లేషకులు, సునిశిత విమర్శకుడిగా ఆయనకు మంచిపేరు ఉంది.

సబ్ ఎడిటర్‌గా జర్నలిస్ట్ జీవితాన్ని మొదలు పెట్టిన వాసుదేవ దీక్షితులు ఎడిటర్ స్థాయికి ఎదిగారు. ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గానూ ఆయన పనిచేశారు. 1942లో జన్మించిన వాసుదేవ దీక్షితులు బీఎస్సీ పూర్తిచేశారు. జర్నలిజం రంగానికి ఆయన అందించిన సేవలకుగాను మద్రాసు తెలుగు అకాడమీ ఖాసా సుబ్బారావు అవార్డుతో సత్కరించింది. దీక్షితులు మృతిపై జర్నలిస్టు సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. జర్నలిస్టుగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

# మోదీకి రష్యన్ అవార్డు

అపాజిల్ రష్యా దేశ అత్యున్నత పురస్కారం. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో అసాధారణ సేవలు అందించినందుకు గానూ ఈ అవార్డును అందిస్తున్నట్లు రష్యా ఎంబసీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ ఇప్పటికే అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. గతేడాది దక్షిణకొరియా సియోల్ శాంతి బహుమతితో మోదీని సత్కరించగా.. ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఇచ్చే ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం జాయెద్ మెడల్‌కు ప్రధాని ఎంపికయ్యారు. ఈ అవార్డును మోదీకి ఇవ్వనున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ఖలీఫా బిన్ జాయెద్ బిన్ సుల్తాన్ ప్రకటించారు. భారత్, యూఏఈ మధ్య చారిత్రక, వ్యూహాత్మక బంధాలను బలోపేతం చేయడంలో మోదీ కీలక పాత్ర పోషించారని, అందుకే ఆయనను జాయెద్ మెడల్‌తో సత్కరించనున్నట్లు అరబ్ దేశం వెల్లడించింది.

# ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

60 శాతం, ద్వితీయ సంవత్సరంలో 72 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంతో పోలిస్తే ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైంది. అటు ప్రథమ, ఇటు ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

ప్రథమ సంవత్సర ఫలితాల్లో.. జనరల్‌లో మొత్తం 60 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది. వొకేషనల్‌లో 49 శాతం ఉత్తీర్ణత సాధించారు. కృష్ణా (72), పశ్చిమ గోదావరి (69), నెల్లూరు (67) జిల్లాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. జనరల్‌లో బాలికలు 64 శాతం, బాలురు 56 ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ సంవత్సర ఫలితాల్లో.. జనరల్‌లో 72 శాతం ఉత్తీర్ణత నమోదు అవ్వగా.. వొకేషనల్‌లో 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కృష్ణా (81), చిత్తూరు (76), నెల్లూరు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలు 74 శాతం ఉత్తీర్ణత శాతాలతో తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. బాలికలు 75, బాలురు 68 శాతం ఉత్తీర్ణత సాధించారు.

**14న సప్లిమెంటరీ..**

ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 27న మొదలై 18తో ముగిశాయి. కేవలం 24 రోజుల్లోనే ఫలితాలు విడుదలవ్వడం విశేషం. మొత్తం 10.17 లక్షల మంది విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోగా.. 9.65 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఉదయలక్ష్మి తెలిపారు. వీరిలో 6.3 లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా.. 3.3 లక్షల మంది ఫెయిలయ్యారు. మే 14 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రుసుము చెల్లించేందుకు ఈ నెల 24ను తుది గడువుగా నిర్ణయించారు.

# సుప్రీం తీర్పుపై రివ్యూ పిటీషన్ వేస్తా

ఆరు రోజులు పట్టడమేంటని సీఎం ప్రశ్నించారు. వీవీప్యాట్‌లోని స్లిప్‌లు లెక్కించడానికి ఆరు గంటలు మించదని వెల్లడించారు. గతంలో బ్యాలెట్ పత్రాలు లెక్కించే పద్ధతిలో ఎంత సమయం పట్టిందో గుర్తు చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో తాను ఛాలెంజ్ చేస్తున్నానని, నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. దీనిపై దేశ స్థాయిలో పోరాడేందుకు సిద్ధమని వెల్లడించారు. అవసరమైతే ధర్నాలు, ఆందోళనలు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే పదవి అంగటి సరకులా తయారైందని, ప్రజాప్రతినిధుల భవిష్యత్ యంత్రాలపై ఆధారపడి ఉండడమేంటని సీఎం విమర్శించారు. ఏకధాటిగా రెండు గంటలపాటు యంత్రం పని చేయకపోతే రీపోలింగ్‌కు అవకాశముందని వివరించారు.

# అవినీతి నిర్మూలనే లక్ష్యం

పురపాలక సంస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు వాటికి అధికారాలు, బాధ్యతలు బదలాయించేలా కొత్త చట్టం చేయనున్నట్టు గతంలోనే సీఎం ప్రకటించారు. దీనిలో భాగంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజే కేసీఆర్ వీటిపై దృష్టిపెట్టారు.

నూతన పురపాలక చట్టంలో ఏయే అంశాలపై దృష్టిపెట్టాలి? ఏయే బాధ్యతలు పురపాలక సంస్థలకు అప్పగించాలనేదానిపై కీలకంగా అధికారులతో కేసీఆర్ చర్చిస్తున్నారు. త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని ముందే తీసుకురావాలా? ఎన్నికల తర్వాత తీసుకురావాలా? అనే అంశంపైనా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది.

# నెత్తురోడిన రహదారులు

ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తనకల్లు, నల్లచెర్వు మండలాల సమీపంలోని 42వ నెంబరు జాతీయ రహదారిపై మినీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో 9మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. క్షతగాత్రులను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

కుక్కంటి క్రాస్ నుంచి ప్రయాణికులతో కదిరికి వెళ్తున్న మినీ బస్సు తనకల్లు మండలం పరాకువాండ్లపల్లి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుల్లో చాలా వరకు తనకల్లు మండలానికి చెందిన వారుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న తనకల్లు ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### కర్నూలు జిల్లాలో ముగ్గురు

హాలహర్వి: కర్నూలు జిల్లా నందవరం మండల పరిధిలోని హాలహర్వి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఎమ్మిగనూరుకు చెందిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులు ఎమ్మిగనూరుకు చెందిన వారిగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మల్లికార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే మృతదేహాలను ఎమ్మిగనూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### సంగారెడ్డిలో ఇద్దరు మృతి

జోగిపేట పట్టణం: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అల్మాయిపేట గ్రామ శివారులో బస్సు-కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిని దత్తు (20), కిరణ్ (19)గా గుర్తించారు. సాధారణ రహదారి నుంచి కారు జాతీయ రహదారిపైకి ప్రవేశించే క్రమంలో ఇరువైపులా గమనించకుండా ముందుకు పోవడంతో నారాయణఖేడ్ నుంచి సంగుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సును వీరు ఢీకొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. అనంతరం క్రేన్ సాయంతో వాహన శకలాలను తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


# విజయంపై వైయస్సార్‌సిపి ధీమా

విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వ పాలన దమనకాండ, ప్రజావ్యతిరేక నిర్ణయాలకు, జిల్లా ప్రజలు నిరశన తెలుపుతూ నిన్న జరిగిన ఓటింగ్‌లో అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసిన ఓట్లతో జిల్లాలోని 9 శాసనసభ, 3పార్లమెంట్ స్థానాలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్ధులు విజయం సాధించనున్నారని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు దీమా వ్యక్తం చేశారు.శుక్రవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దివంగత ముఖ్యమంత్రి డా॥ వై.యస్.రాజశేఖర్‌రెడ్డి తరహా సంక్షేమపాలన కావాలని అందుకు వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి సరియైన నాయకుడుగా ప్రజలు బావించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసారన్నారు. ఐదేళ్లపాటు ప్రజలు ప్రభుత్వపాలన పట్ల విసుగుచెంది జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ అభ్యర్ధుల విజయానికి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి పనిచేశారని ఆయన ప్రశంసించారు. రెండవ పర్యాయం శాసనసభ్యురాలుగా ఎన్నిక కానున్న కురుపాం ఎమ్మెల్యే శ్రీమతి పుష్పశ్రీవాణి, ఆమె భర్త అరకు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు పరీక్షిత్‌రాజలపై ఓటమి భయంతో తెలుగుదేశం నాయకులు చేసిన దాడిని వైసిపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

రిగ్గింగ్ జరిగిన ఘటనపైన ఎమ్మెల్యే దంపతులపై జరిగిన దాడిపైన ప్రభుత్వం , పోలీసులు తగుచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో ఒకటి, రెండు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతగా జరిగిందని అధికార యంత్రాంగం , పోలీసులు చక్కని సమన్వయంతో ఎన్నికలు నిర్వహించినందున కలక్టరు, ఎస్పీలను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభినందిస్తుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.మే 23తరువాత రాష్ట్రంలో వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమపాలన అందించే ప్రభుత్వం ఏర్పడనున్నదని జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

ఇప్పటివరకు జిల్లాను అంధకారంలోకి నెట్టి , ప్రజాగ్రహానికి గురికాబడిన తెలుగుదేశం ప్రభుత్వం పతనమయ్యిందని శ్రీనివాసరావు పేర్కొంటూ ప్రజలందరూ కోరుకొనే వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.ఈ సమావేశంలో మజ్జి శ్రీనివాసరావుతోపాటు జిల్లా నాయకులు కె.వి. సూర్యనారాయణరాజు, పిళ్ళా విజయకుమార్, అంబళ్ల శ్రీరాములునాయుడు, డెంకాడ , నెల్లిమర్ల పార్టీనాయకులు రొంగలి కనకసింహాచలం, జానా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# ఈసీ మోదీ చేతిలో ఉంది : కేఏ పాల్



భీమవరం: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో ఉందని.. ఆయన చెప్పినట్టే ఈసీ చేస్తోందని ప్రజాశాంతి అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. ఈవీఎంల పనితీరుపై తాను ఎప్పట్నుంచో అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నా పట్టించుకోలేదన్నారు. శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నికల సంఘంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈసీపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ అవుతున్నాయని తాను, కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ అనేక సార్లు మాట్లాడుకున్నామన్నారు. పలుమార్లు ఈ విషయాన్ని మీడియాలో కూడా చెప్పానని పాల్ వ్యాఖ్యానించారు.

# ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల భవితవ్యం

## ఏయూ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు

## ఈవీఎంలకు భారీగా భద్రతా ఏర్పాట్లు



డాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల భవిష్యత్ ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైంది.

66.47 శాతం మేర పోలింగ్ నమోదయింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ పోలింగ్ కొనసాగింది. రాత్రి 9 దాటాక పోలింగ్ బృందాలు ఒక్కొక్కటిగా విశాఖకు చేరుకున్నాయి. ఈ ప్రక్రియ శుక్రవారం కూడా కొనసాగింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లకు ఈవీఎం యంత్రాలను తరలించారు.

తొలుత భీమిలీ, విశాఖ తూర్పు నియోజకవర్గాల ఎన్నికల ఈవీఎం యంత్రాలను తీసుకువచ్చారు. ఎన్నికల అధికారులు వీటికి సీళ్ళు వేసి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. రాత్రి 11 ప్రాంతంలో విశాఖ దక్షిణ, పశ్చిమ, గాజువాక, ఉత్తర నియోజక వర్గాల పోలింగ్ బృందాలు ఈవీఎం యంత్రాలను తీసుకు వచ్చి వాటిని కూడా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

ఆ తర్వాత పెందుర్తి, అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం తదితర నియోజకవర్గాల నుంచి పోలింగ్ బృందాలు ఈవీఎం యంత్రాలను తీసుకు రావడంతో వాటిని కూడా సీళ్ళు వేసి భద్రపరిచారు. జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ ,జాయింట్ కలెక్టర్ సృజన తదితర రెవెన్యూ అధికారులు, ఎన్నికల పరిశీలక అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల ఫలితాల యంత్రాలను తగు జాగర్తలు, భద్రత ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. ఎన్నికల ఫలితాలు వచ్చే నెల మే 23న ప్రకటించనున్నందున వీటిని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఇంజినీరింగ్ కళాశాల గదుల్లో ఉంచారు.

# శానిటేషన్ పనుల పరిశీలన



నర్సీపట్నం: మున్సిపాలిటీలో జరుగుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు పరిశీలించారు. చింతపల్లి రోడ్డు, టీవీఎస్ షోరూమ్ వద్ద చేస్తున్న పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# నాతవరంలో 82శాతం నమోదు

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో 82శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ మొత్తం 5,863 ఓట్లు ఉండగా 4,843 ఓట్లు పోలయ్యాయి. మల్లుభూపాలపట్నంలో 76శాతం, సరుగుడులో 70శాతం నమోదైంది. మన్యపురట్ల, చమ్మచింత, మల్లుభూపాల పట్నం లో రాత్రి 8 గంటలు దాటిన తర్వాత కూడా పోలింగ్ జరిగింది.

# ఫలించిన పోలీసుల వ్యూహం

## మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్

కొయ్యూరు: మండలంలో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 40,892 ఓటర్లకు 56 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 65శాతం మేరకు పోలింగ్ జరిగింది. అయితే అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎం.భీమవరం, యు.చీడిపాలెం, బూదరాళ్ల, మంప పంచాయతీల్లో 12 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు వీటిలో ఎం.భీమవరంలో 777 ఓట్లకు 449, పిఎల్.కొత్తూరు 343కు గాను 173 ఓట్లు, అలాగే యు.చీడిపాలెం పోలింగ్ స్టేషన్‌లో 613కు గాను 372, రేవులకోటలో 608కు గాను 269, పలకజీడి 583కు గాను 435 ఓట్లు పోలయ్యాయి. అలాగే బూదరాళ్ల పోలింగ్ కేంద్రం 68లో 949కుగానూ 363, పోలింగ్ కేంద్రంలో 445కు గాను 149 ఓట్లు పోలయ్యాయి. అలాగే అదే పంచాయతీలో చేరిన గరిమండ పోలింగ్ కేంద్రంలో 543కుగాను, 305, సాకులపాలెంలో 512కు గాను 272, బాలరేవులో 272కు గాను 141 ఓట్లు పోలయ్యాయి.

అలాగే పంచాయతీలకు సంబంధించి పోలింగ్ సేటషన్‌ను 84లో 650 ఓట్లకుగాను 492, అలాగే మరో స్టేషన్ 85లో 770 ఓటర్లకు గానూ 545 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద గత ఎన్నికల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో నిర్వహించిన పోలింగ్‌లో వచ్చిన పోలింగ్ శాతం కన్నా ప్రస్తుతం ఎన్నికల్లో 30శాతం మేర పోలింగ్‌శాతం పెరిగింది. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పక్కా ఏర్పాట్లు చేశారు.

# వాసుదేవ దీక్షితులు మృతికి ఏపీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

విశాఖపట్నం : సీనియర్ పాత్రికేయులు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి మాజీ ఛైర్మన్ శ్రీ వి.వి.వాసుదేవ దీక్షితులు మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ మహా విశాఖ నగరశాఖ దిగ్భ్రాంతిని వ్యక్తపరిచింది. శ్రీ వాసుదేవ దీక్షితులు ఆత్మకు శాంతి చేకూరాలని నేషనల్ అలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ మహావిశాఖ నగరశాఖ అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి ఎస్.అనూరాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, కోశాధికారి ఎ.సాంబశివరావు, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ నగరశాఖ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావులు భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. శ్రీ వాసుదేవ దీక్షితులు ఆంధ్రప్రభ దినపత్రిక పూర్వ సంపాదకులుగాను పనిచేశారు. గుండెపోటుతో తుదిశ్వాస విడిచిపెట్టడం జర్నలిస్టుల కమ్యూనిటీకి తీరని లోటని వారు పేర్కొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపించిన సెంట్ ఆన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు

ములగాడ: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు ఈ సంవత్సరం కూడా విద్యార్థినిలదే పై చేయి చూపించారు దీనిలో భాగంగా పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం సెంట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభను చూపించి అత్యధిక మార్కులు సాధించారు ఈ విషయంపై జాతీయ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థినులు మంచి ప్రతిభ ని చూపించి ముందుకు సాగడం చాలా గొప్ప విషయమని ముందు ముందు మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుతారని వీరికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని ఆమె అన్నారు అనంతరం ప్రతిభను సాధించిన విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు.


# గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



మద్దిలపాలెం: విశాఖ అర్బన్-2 మద్దిలపాలెం సెక్టారులో గల కేఆర్‌ఎం కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేయడం జరిగింది. వారి రక్తంలో హిమోగ్లోబిన్ 10.9 కన్నా తక్కువ ఉన్న వారికి బాలసంజీవని పంపిణీ చేయడం జరిగింది. రక్తహీనత తక్కువగా ఉన్న తల్లులకు బలం చేకూరి ఆరోగ్యవంతులు కావాలని పప్పుచెక్కలు, ఖర్జూరం, చోడిపిండి, బెల్లం తదితర పౌష్టికాహార పదార్ధాలను పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన బిడ్డలకు గర్భిణీలు జన్మనివ్వాలనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రంలో ఈ పదార్ధాలు పంపిణీ చేసినట్లు అంగన్వాడీ టీచర్ ఆర్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

### అయ్యో! ఆశా వర్కర్లకు భవిష్యత్‌లో

# ఎలక్షన్ డ్యూటీలు వెయ్యొద్దు



అరకులోయ : పాపం చదువు రాని ఆశలు ఎలక్షన్ల డ్యూటీలు. తమకు ఏ బస్సు ఎక్కడకు వెళుతుందో.. ఏ బస్సెక్కి తమ తమ ఊర్లకి వెళ్ళాలో.. అభం శుభం తెలియని ఆశాలకు ఎలక్షన్ డ్యూటీకి ఎవ్వరైనా ఏ బుద్ది లేనీ బుద్ది ఉన్న ప్రభుత్వం అయినా డ్యూటీలు వేస్తారా? తమ పేర్లు రాయండి అంటే ఒక అక్షరం కుడా రాయలేనీ కొంత మంది తెలియని ఆశాలున్నారు అలాంటి అభం శుభం తెలియని ఆశాలకు ఎలక్షన్ డ్యూటీలు వేసి అధికారులు వాల్ల మీద కోపం పడుతూ చుక్కలు చూపించారు.పాపం చదువు రాని అభం శుభం తెలియని తల్లిలు డ్యూటిలు ఎలా చేశారో కాని చూసిన వాల్లకి మాత్రం గుండె తరుక్కు పోయింది.దీంతో సగానికి సగం మంది ఆశాలతో పాటు ఆయా మండలాల ఆరోగ్య సిబ్బంది ఓటు వెయ్యకుండా ఓటు కోల్పోయారు.దీనికి బాద్యులెవరు ప్రభూత్వమ?డ్యూటిలు వేసిన పై అధికారులదా?భవిషత్ లో నైన ఆశాలతో పాటు వృద్ద ఉద్యోగులకు పిల్ల తల్లులకు గర్భిణీలకు ఎలక్షన్ డ్యూటిలు వెయ్య కుండా అటు ప్రభుత్వం ఇటు అధికారులు ఆలోచించాలని పలువురు అంటున్నారు.

### ఆలస్యంతో ఓట్లు కోల్పోయాం

అరకులోయ నియోజక వర్గంలో గురువారం జరిగిన ఎలక్షన్ లో అరకులోయ మండలం చోంపి పంచాయతీ చోంపి బూత్‌లో ఆలస్యంగా 8.30 గంటలకు మొదలు పెట్టి 3.30 గంటల సమయంలో బూత్ మూసేయడం వలన సుమారు 50 నుండి 60 మంది వరకు ఓట్లు కోల్పోయాం అని చోంపి పంచాయతీ ఓటర్లు ఆవేదన చెందుతున్నారు.ఎలక్షన్ బూత్ అధికారిని ఓట్లు కోల్పోయిన ఓటర్లు మాకు ఓటు హక్కును వినియోగించనివ్వండని ఇంకా సమయం ఉంది కదా,పక్క పంచాయతీ బూత్‌లో 4, 5 గంటల వరకు ఓటు వెయ్య నిస్తున్నారు మీరెందుకు బూత్ మూసేసారు అంటే బూత్ అధికారుల ఓటర్లతో చాల కోపంగా వ్యహారించారు ఓటర్లను బయటికి నెట్టి వెయ్యించేసారు.దీనితో ఓటర్లు నిరాశతో ఇంటిబాట పట్టారు.అలాగే మంజగుడ బూత్‌లో అధికారుల నిర్లక్ష్యం వల్ల సగం మంది ఓట్లు కోల్పోయారు.హుకుంపేట మండలం సంతారి ఏరియా చిన్నబూరుగుపుట్టు బూత్ లో ఎలక్షన్ బూత్ అధికారుల నిర్లక్ష్యం వలన 8.30 గంటలకు బూత్ తియ్యడం వలన ఆరుబయట పడిగాపులు కాసి సుమారు 60 మంది వరకు ఓటర్లు ఓటు హక్కు కోల్పోయాం అని అ పంచాయతీ ఓటర్లు అన్నారు ఈ బూత్ లో కుడా 4 గంటలకు బూత్ మూసేయ్యడం వలన సగం మంది ఓటర్లు బాదతో ఇంటిబాట పట్టారు.పెదబయలు మండలం అనంతగిరి ముంచంగిపుట్టు మండలాల్లో ఇదే పరిస్తితి 9, 10 గం.లకు బూత్ తెరచి 3.30 గం.లకు బూత్ లు మూసేసారు.చివరకి కొన్ని ఏరియాల్లో ఓటర్లను రక్షణ కల్పించే రక్షణ సిబ్బంది కుడా బూత్ లలో లేక పోవడంతో ఓటర్లు చాల గొడవ పడి తంటాలు పడి ఓటెయ్యాల్సిన పరిస్తితి,ఓటక్కు ఉండి కుడా స్లిప్పులు ఇవ్వక పోవడంతో ఓటక్కు కోల్పోయాం అని ఓటర్లు నేటికి బాద పడుతూ ఈ పోలింగ్ బూత్ అధికారులపైన వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చెయ్యలని చోంపి పంచాయతీ చిన్నబూరుగుపుట్టు బూత్ ఓటర్లు కోరుతున్నారు.

# బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

## సిఐ లక్ష్మణమూర్తి

రావికమతం: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఎక్కడైనా బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కొత్తకోట సిఐ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న వివాదాల మినహా రావికమతం మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఎన్నికలు అయిన సందర్భంగా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారిపై సమాచారం ఇవ్వాలన్నారు.

### సహకరించిన ఓటర్లకు

# దన్యవాదాలు

### డాక్టర్‌సత్యవతి



అనకాపల్లి ...ఎన్నికలలో సహకరించిన అభిమానులకు ఓటర్లకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సత్యవతి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేసారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం కష్టపడిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు, అలాగే అసెంబ్లీ అభ్యర్థులకు పేరు పేరునా దన్యవాదాలు తెలియజేస్తున్నట్లు డాక్టర్ సత్యవతి తెలిపారు.

# ఓటరు తీర్పు వైఎస్సార్సీపీవైపే




విశాఖపట్నం : రానున్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని ఓటర్లందరూ వైఎస్సార్సీపీకే తమ అమూల్యమైన ఓటు వేశారని తూర్పు నియోజకవర్గ అభ్యర్థి అక్కరమని విజయనిర్మల తెలియజేశారు. శుక్రవారం మద్దిలపాలెం నగర కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. సాధారణ కార్యకర్త కష్టం ఏ విధంగా ఉంటుందో నాకు తెలుసు అని నేను తొమ్మిదేళ్లుగా కార్యకర్తల పనిచేసేందుకు నాకు తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా జగన్ మోహన్ రెడ్డి అవకాశం ఇచ్చారని ఆమె అన్నారు. అదేవిధంగా నేను గెలిచిన వెంటనే ప్రతి కార్యకర్త ఋణం తీర్చుకుంటానని ఆమె చెప్పారు అదేవిధంగా నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ ధన్యవాదాలు తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ఘనవిజయం సాధించబోతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, అదేవిధంగా వార్డు అధ్యక్షులు అనుబంధ సంఘాల అధ్యక్షులు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# 14న రామనారాయణంలో శ్రీరామనవమి వేడుకలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 14వ తేదీ ఆదివారం నాడు శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున్నామని ప్రాంగణం సీఈఓ టి ఎల్ ఎన్ మూర్తి అన్నారు. శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రులను ఆవిష్కరించి మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం 7 గంటలకు సీతారాములకు స్నపనము, తారక రామమంత్ర హెూమం ఉంటాయని శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద పర్యవేక్షణలో సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం వైభవ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు గోపీనంబాళ శేషాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమ అనుసారముగా సీతారాముల కళ్యాణం జరుగుతాయని, ఉత్సవంలో భాగంగా విశాఖకు చెందిన చైతన్య సోదరుల సాంప్రదాయ సంకీర్తనల సమ్మేళనం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాసరాజు, ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెూమకార్యక్రమం

బురుజుపేట: శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవములు శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం యొక్క దత్తత దేవాలయం అగు శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో తేది. 11-04-2019న ప్రారంభించబడిన శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవములలో భాగంగా శుక్రవారం ఉదయం 9.00 గం.లకు మరియు సాయంత్రం గం..6.30 ని.లకు హోమములు నిర్వహించుట జరిగినది.

తేది. 14-04-2019న ఆదివారం ఉదయం 5.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు అభిషేకం, ఉదయం 10.00 గం. ల నుండి 12 గం.ల వరకు శ్రీ సీతారామ కళ్యాణం, తదుపరి 4000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగును. ఈ అభిషేకంలో పాల్గొనదలచిన భక్తులు రూ. 516/-లు మరియు సీతారామ కళ్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ. 1116/-లు ముందుగా చెల్లించి తమ పేరు నమోదు చేసుకొని శ్రీ సీతారామచంద్రులవారి కృపకు పాత్రులు కావలసినదిగా కొరడమైనది.

సాంస్కృతిక కార్యక్రమములు

సాంస్కృతిక కార్యక్రమములలో భాగంగా శుక్రవారం పిల్లా శ్రీదేవి, విశాఖపట్నం వారిచే అన్నమాచార్య కీర్తనలు , కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకొన్నది. 13న స్థిరవారం ఇ. సత్యవాణి, విశాఖపట్నం వారిచే అఖండనామ సంకీర్తనలు ఏర్పాటు చేయడమైనది.

అన్న వితరణ:

సీతారామ కళ్యాణ మహోత్సవములులో భాగంగా 300 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేయుట జరిగినది.

పై కార్యక్రమంలో ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి ఆర్. పుష్పనాథం ధర్మకర్తల మండలి చైర్మన్ జ. ప్రసాద్ రావు, ధర్మకర్తలు బి. సత్యరూపవాణి, పి. వరలక్ష్మి, బి.శ్రీనివాస రావు, వి. రామూర్తి, కె. బాస్కర రావు, జి. సత్యవతి, బి. రవిశంఖర్, ఎస్. జయ్ కుమార్, ఎన్. సత్తిరాజు, సహాయ కార్యనిర్వాహణాధికారి వి. రాంబాబు, ఎస్. సూర్యకుమారి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వాహణలో అధికారులు విఫలం

అనకాపల్లి : ఎన్నికల నిర్వాహణలో ఎన్నికల కమీషన్ పూర్తిగా విఫలమైందని అనకాపల్లి కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ అభ్యర్ది అయ్యార్ గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆయన స్దానిక విలేకర్లతో మాట్లాడారు. గత పదిరోజులుగా మద్యం ఏరులైపారుతున్న ఎన్నికల అధికారులు, ఆబ్కారి అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజవర్గంలో అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఓటుకు 1000 నుండి 2000 రూపాయల వరకు పంపిణీ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసారని విమర్శించారు. ఓటమి భయంతో బరితెగించిన అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను ప్రలోబాలకు గురిచేసి, భయాందోళనలో ముంచెత్తారని అన్నారు.

ప్రజా జీవితంలో లేని అభ్యర్దులు ఫలితాల అనంతరం వారి వారి సొంత ప్రదేశాలకు వెళ్లిపోయి వ్యాపారాలు చేసుకోవడం తప్ప ప్రజలకు వారు వొరగబెట్టేది ఏమి ఉండదని విమర్సించారు. తక్కువ మేజార్టీతోనైనా ఓటర్లు రాహుల్ గాంధీనీ ప్రధాని చేయడానికి ప్రత్యేక హెూదాకి అనుకూలంగా నిశబ్దంగా వాతవరణలో కాంగ్రెస్‌కు ఓటు వేసారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈనిశబ్ద విప్లవంలో అనకాపల్లిలో కాంగ్రెస్ విజయం సాదించి తీరుతుందని గంగాధర్ అన్నారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎగ్గాడ భాస్కరరావు తుట్టా రమణ, గుణబాబు, సోమేష్, ఎస్. కరిముల్లా, సంతోష్, బుద్ద సాయి, శ్రీను, పార్వతి సంతోష్, కనకరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# బసవపున్నయ్య పాత్ర అద్వితీయం



మార్క్సిస్టు పార్టీ అగ్ర నాయకులు, సిద్ధాంతవేత్త మాకినేని బసవపున్నయ్య 27వ వర్ధంతి సభ శుక్రవారం సాయంత్రం మద్దిలపాలెం లోనున్న సిపిఐ (ఎం) నగర కార్యాలయంలో జరిగింది. ముందుగా శ్రీ బసవపున్నయ్య చిత్రపటానికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ భారతదేశ వామపక్ష ఉద్యమంలో మాకినేని బసవపున్నయ్య పాత్ర అద్వితీయమైనదని పేర్కొన్నారు. సిపిఎం పార్టీని ధృడంగా నిలబెట్టి పురోగమించేలా విశిష్టమైన కృషి చేసారని, భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినా, రాజ్యసభ సభ్యుడుగా ఉన్నా, అత్యంత నిరాడంబరమైన జీవితం గడిపారని తెలియజేసారు. నేటితరం కమ్యూనిష్టులు బసవపున్నయ్యను ఆదర్శంగా తీసికొని సమాజ మార్పునకు కృషి చేయాలని నర్సింగరావు పిలుపునిచ్చారు. సభకు నగర కార్యదర్శి వి.ఎస్.పద్మనాభరాజు అధ్యక్షత వహించగా, నగర కమిటీ నాయకులు జి.ఎస్.రాజేశ్వరరావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, ఎమ్.సుబ్బారావు, ఎమ్.ప్రదీప్ కుమార్, కె.స్వతంత్రకుమార్ తదితరులు మరియు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## విజ్ఞానశాస్త్రంలో అనేక ఆవిష్కరణలు

అంతరిక్షంలో అల్లంతదూరాన ఉన్న కృష్ణ బిలాన్ని భూగోళంలోని టెలిస్కోపుల సమన్వయంతో చిత్రీకరించగలుగడం శాస్త్రవిజ్ఞానంలోనే కాదు సాంకేతిక రంగంలో కూడా మానవులు సాధించిన ప్రగతికి నిదర్శనం. విజ్ఞానశాస్త్రంలో అనేక ఆవిష్కరణలు మానవులు తమ అనుభవాలతో, ప్రయోగాలతో ఆవిష్కరించినవే. అయితే ఇంద్రియ జ్ఞానానికి అతీతంగా ఉన్న అనేక వైజ్ఞానిక సత్యాలను, సూత్రాలను మానవులు బౌద్ధికశక్తితో గ్రహించగలిగారు. తర్కబద్ధమైన ఆలోచనాధోరణి అనేక విశ్వ సూత్రాలను ఆకళింపు చేసుకోవడానికి దారితీసింది. కృష్ణ బిలానికి సంబంధించిన పరిజ్ఞానం కూడా ఆ విధంగా సమకూర్చుకున్నదే. భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్, అంతరిక్ష పరిశోధకుడు, భౌతికవేత్త ష్వార్జ్‌చైల్డ్ తదితరులు గణిత సూత్రాల ద్వారా కృష్ణబిలాల ఉనికిని ఊహించగలిగారు. ఇంతకాలం మనం చూస్తున్న కృష్ణ బిలం సూత్రాలు చిత్రకారులు ఊహించి గీసినవే తప్ప ఎవరూ చూసింది లేదు. కానీ మానవుడు టెలిస్కోపుల ద్వారా నైనా కృష్ణ బిలాన్ని చూడగలుగడం అద్భుతమే. ప్రపంచమంతటా నెలకొని ఉన్నటెలిస్కోపులను సంధానం చేయడం వల్ల భూగోళమే ఒక ప్రయోగశాల మాదిరిగా మారిపోయింది. ఈ టెలిస్కోపుల మధ్య సెకనులో శతకోటి వంతు కూడా తేడాలేకుండా సంకేతాలను సమన్వయం చేసుకొని పరిశోధించడం అసాధారణం. ఆ పరిశీలనల డేటాను భరించే శక్తి ఇంటర్‌నెట్‌కు లేకపోవడంతో, హార్డ్‌డ్రైవ్‌ల ద్వారా ఒకచోట చేర్చి సమన్వయం చేశారు. కంప్యూటర్ అల్గోరిథమ్స్ నిర్మించడం కూడా ఈ పరిశోధన విజయవంతం కావడానికి కారణమే. జీవుల జన్యు రహస్యాలను విప్పి చూడటమైనా, అంతరిక్షంలోకి తొంగిచూడటమైనా ఇటీవలికాలంలో మానవులు సాధిస్తున్న పురోగతిని సూచిస్తున్నాయి. కృష్ణబిల స్వభావాన్ని సింగులారిటీగా అభివర్ణిస్తున్నప్పటికీ, దానిని నిర్వచించడం కూడా సాహసమే. కృష్ణబిలం గురించి తెలుసుకోవడం అంటే విశ్వ రహస్యాలను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే. మహా విస్ఫోటం జరిగి విశ్వం విస్తరిస్తూ పోతున్నదనే వాదన అంగీకరించినా, అందుకు సంబంధించిన అవగాహన ఇంకా పట్టుబడవలసి ఉన్నది. అణువు, పరమాణువు వివిధ పదార్థాల నిర్మాణానికి సంబంధించి మనం చెప్పుకునే ప్రామాణిక భౌతిక సూత్రాలు విశ్వంలోని నాలుగోవంతు పదార్థానికి మాత్రమే వర్తిస్తాయి. టెలిస్కోపుల ద్వారా గ్రహించిన కృష్ణ బిలం చిత్రంతోపాటు ఆ చుట్టూ వాయువుల వలయం కూడా చూడగలుగుతున్నాం. కృష్ణ బిల చిత్రం కొంత మసకగా ఉన్నప్పటికీ, సంతృప్తికరంగా ఉందనీ, భవిష్యత్తులో టెలిస్కోపులను పెంచడం ద్వారా మరింత స్పష్టమైన చిత్రాలు వస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ కృష్ణ బిలం భూమి కి ఐదున్నర కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నది. మన భూమి లేదా సౌరమండలం ఉన్న ది పాలపుంత అనే నక్షత్ర రాశిలో కాగా, ఈ కృష్ణ బిలం ఉన్నది పొరుగున ఉన్న ఎం87 అనే నక్షత్రరాశిలో. ప్రతి నక్షత్ర రాశిలో ఇటువంటి కృష్ణ బిలాలుంటాయి. భారీ నక్షత్రం అంతరిస్తున్నప్పుడు ఇటువంటివి ఏర్పడుతాయి. ఈ కృష్ణ బిలానికి బ్రహ్మాండమైన గురుత్వాకర్షణ శక్తి ఉం టుంది. చుట్టూరా పదార్థాన్నీ, శక్తినీ తనలోకి ఆకర్షించుకుంటుంది. కాంతిని కూడా బయటకు పో నీయదు. అందువల్లనే నల్లబిలంగా కనిపిస్తుంది. నల్లబిలం చుట్టూరా ఈవెంట్ హారిజన్‌గా చెప్పుకునే హద్దు ఉంటుంది. ఈ నల్లబిలం ప్రభావం విస్తరించి ఉన్న ప్రాంతంలో ని పదార్థమంతా ఈవెంట్ హారిజన్ వైపు వచ్చి అందులో పడిపోతుంది. ఈవెంట్ హారిజన్‌లోకి వచ్చిన పదార్థమైనా, శక్తియైనా వెనుకకు పోవడమనేది ఉండదు. అణు స్వరూపంలేని ప్లాస్మా ఏర్పడి, అత్యంత ఉష్ణం నెలకొని ఉంటుంది. గ్రహాలు సూర్యుడి ఆకర్షణ నుంచి తప్పించుకోవడానికి పరిభ్రమించినట్టుగానే, పదార్థం ఆకర్షణను తట్టుకు నే ప్రయత్నంలో పరిభ్రమిస్తుంది. పైకి ఎగజల్లే కాంతిపుంజాలు కూడా వంగిపోతాయి. కోట్లాది సూర్యులకు సమానమైన కాంతి ఉండటం వల్ల మనం చూడగలుగుతున్నాం. ఈవెంట్ హారిజన్ వైపు వచ్చిన పదార్థం క్రమంగా మసకబారి పతనమవుతుంది. అందులోని పదార్థం స్వభావస్వరూపాల గురించి మనకు కనీసం అంచనా కూడా లేదు. ఈవెంట్ హారిజన్‌లో ద్రవ్యరాశి, శక్తి అనంతమైనదిగా ఉండి అత్యంత దట్టంగా కూరుకుపోయి ఉంటుంది. ఈవెంట్ హారిజన్‌లో మనం చెప్పుకుంటున్న భౌతిక సూత్రాలన్నీ అసంబద్ధమైపోతా యి. కృష్ణబిల స్వభావాన్ని సింగులారిటీగా అభివర్ణిస్తున్నప్పటికీ, దానిని నిర్వచించడం కూడా సాహసమే. కృష్ణబిలం గురించి తెలుసుకోవడం అంటే విశ్వ రహస్యాలను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే. మహా విస్ఫోటం జరిగి విశ్వం విస్తరిస్తూ పోతున్నదనే వాదన అంగీకరించినా, అందు కు సంబంధించిన అవగాహన ఇంకా పట్టుబడవలసి ఉన్నది.

# చంద్రుడిపై కూలిన ఇజ్రాయెల్ స్పేస్‌క్రాఫ్ట్



జెరూసలెం : చిన్న దేశం.. పెద్ద కలలు అని పేర్కొంటూ ఇజ్రాయెల్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూన్ మిషన్ విఫలమైంది. చంద్రుని ఉపరితలంపై దిగేందుకు ఉద్దేశించిన బేరేషీట్ అంతరిక్ష నౌకలో చివరి దశలో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో ఇది చంద్రుని ఉపరితలంపై మరికాసేపట్లో దిగుతుందనగా కుప్ప కూలింది. గురువారం చంద్రునిపై లాండింగ్ సమయంలో రోబోటిక్ లాండర్‌లోని ఇంజిన్‌లో సాంకేతిక లోపంతోపాటు కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా దెబ్బతిందని మిషన్ సిబ్బంది తెలిపారు.

బుధవారం చంద్రుడి అతి సమీపంలోని దీరవృత్తాకార కక్ష్యలోకి ఇది ప్రవేశించింది. చంద్రుని ఉపరితలానికి 15-17 కిలోమీటర్ల దూరంలో ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో చంద్రుని ఉపరితలాన్ని ఢీకొట్టి ఆ దేశానికి నిరాశను మిగిల్చింది. ఇజ్రాయెల్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా బేరేషీట్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగించింది. బేరేషీట్ అంటే బైబిల్ పదబంధంలో ఆరంభంలో అని అర్థం. ఈ ప్రయోగం కోసం దాదాపు వంద మిలియన్ డాలర్లను వెచ్చించింది. ప్రైవేట్ స్పేస్ అంకుర సంస్థ స్పేస్‌ఐఎల్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా ఈ స్పేస్‌క్రాఫ్ట్‌ను నిర్మించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించారు. ఇది దాదాపు ఏడు వారాలపాటు అంతరిక్షంలో ప్రయాణించి కక్ష్యలను పెంచడం ద్వారా చంద్రుని సమీపంలోకి చేరింది. గతవారమే చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రునిపై సురక్షితంగా లాండర్‌ను దించిన నాలుగో దేశంగా ఇజ్రాయెల్ ఘనత సాధించి ఉండేంది. ఇప్పటివరకూ చంద్రునిపై అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే సురక్షితంగా లాండర్లను దించగలిగాయి.

# ధోనికి జరిమానా

జైపూర్ : ధోనికి జరిమానా పడింది. రాజస్థాన్‌తో మ్యాచ్ సందర్భంగా డగౌట్‌లో ఉన్న ధోని మైదానంలోకి దూసుకొచ్చి అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. అయితే, ధోని చర్యను ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన రెండో స్థాయి నేరంగా పరిగణిస్తూ జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసినందుకు గానూ ఐపీఎల్ యాజమాన్యం ఆర్టికల్ 2.20 ప్రకారం శిక్షలు విధిస్తుంది. దీంతో ధోనికి మ్యాచ్ ఫీజులో 50శాతం కోత పడింది.

అసలేం జరిగిందంటే..

జైపూర్ వేదికగా గురువారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. 155 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన చెన్నైకి ఆఖర్లో మూడు బంతులకు 9 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో ఉన్న శాంట్నర్‌కు రాజస్థాన్ బౌలర్ బెన్ స్టోక్స్.. వికెట్ల కంటే ఎత్తులో బంతిని విసిరాడు. మైదానంలో అంపైర్లలుగా ఉన్న ఉలాస్ గాందే, బ్రూస్ ఆక్సెన్‌ఫర్డ్ తొలుత నోబాల్‌గా ప్రకటించారు. తర్వాత ఆ నిర్ణయాన్ని వెనక్కితీసుకున్నారు. దీంతో డగౌట్‌లో ఉన్న ధోని మైదానంలోకి ఆవేశంగా వచ్చి అంపైర్లతో మాట్లాడుతూ అసహనం వ్యక్తం చేశాడు. అందుకు గానూ ధోనికి ఐపీఎల్ యాజమాన్యం జరిమానా విధించింది. ఆ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో పాటు ధోనీ కెప్టెన్‌గా 100 విజయాల మైలు రాయి అందుకున్నాడు.

# స్మృతి ఇరానీ విద్యార్హతలపై మళ్లీ రగడ

### ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా ప్రకటించాలని కాంగ్రెస్ డిమాండ్

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తన విద్యార్హతలకు సంబంధించి తప్పుడు సమాచారం సమర్పించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల కమిషన్‌కు ఇలా తప్పుడు సమాచారం అందించినందుకు గాను ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అంతేకాకుండా ఒక కేంద్ర మంత్రిగా ఉన్న ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. స్మృతి ఇరానీ డిగ్రీ కూడా పూర్తి చేయలేదని ప్రతిపక్షాలు ఇన్ని రోజులుగా ఆరోపిస్తున్నప్పటికీ ఆమె తిరస్కరిస్తూ వచ్చారన్నారు. కానీ దిల్లీ విశ్వవిద్యాలయంలో ఆమె అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో చేరినట్లు ఆమె అంగీకరించారని.. అది ఇంకా పూర్తి కాలేదంటూ తాజాగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు చతుర్వేది చెప్పుకొచ్చారు. వీటిని పరిగణనలోకి తీసుకొని ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని చతుర్వేది కోరారు. కేంద్ర మంత్రి అయిన స్మృతి ఇరానీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారా లేదా అనే విషయంతో మాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ ఆమె పదేపదే కోర్టులకు తప్పుడు సమాచారం ఇస్తూ వస్తున్నారు. ఇది అసలు సమస్య. ఆమె చెబుతోన్న అబద్ధాలను దేశ ప్రజలు గమనిస్తున్నారు. కచ్చితంగా ప్రజలు ఆమెకు తగిన బుద్ధి చెబుతారు అని చతుర్వేది ధ్వజమెత్తారు. కేవలం ఆమె విద్యార్హతలకు సంబంధించి తప్పుడు రికార్డులను సృష్టించడమే కాకుండా ఎన్నికల కమిషన్‌కు కూడా తప్పుడు అఫిడవిట్‌లను సమర్పించి మభ్యపెడుతున్నారని ఆరోపించారు. దీనికిగాను చట్టప్రకారం ఆమె శిక్షార్హురాలు అని చతుర్వేది అన్నారు. అయితే ఇప్పటివరకు అధికార భాజపా ఈ విషయంలో స్పందించలేదు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆమెఠి లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచిన స్మృతి ఇరానీ నామినేషన్ దాఖలు చేస్తున్న సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో దిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయలేదంటూ వివరాలు సమర్పించారు. 1991లో సెకండరీ స్కూల్, 1993లో సీనియర్ సెకండరీ స్కూల్, 1994లో దిల్లీ విశ్వవిద్యాలయంలో ఓపెన్ స్కూల్ విధానంలో బ్యాచిలర్స్ ఆఫ్ కామర్స్‌లో చేరారని, కానీ అది పూర్తి చేయలేదంటూ స్మృతి తాజా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2004 ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో 1994లో బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసినట్లు ఆమె వివరాలను సమర్పించారు.

తాజా అఫిడవిట్‌లో పూర్తి చేయలేదంటూ వివరాలు సమర్పించడంతో మరోసారి స్మృతి విద్యార్హతల వివాదం తెరపైకి వచ్చింది.

# వారాంతం లాభాలతో..

ముంబయి: దేశీయ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్ మొదలుకావడంతో పాటు కీలక ఆర్థిక గణాంకాలు వెల్లడవుతుండటంతో మార్కెట్ ఆరంభంలో మదుపర్లు కాస్త జాగ్రత్త పాటించారు. దీంతో స్వల్ప లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు ఆ తర్వాత కాస్త ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే చివరి గంటల్లో ఆటోమొబైల్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 160 పాయింట్ల లాభంతో 38,767 వద్ద, నిఫ్టీ 47 పాయింట్లు లాభపడి 11,643 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 69.15గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో ఐటీసీ, గెయిల్, మారుతి సుజుకీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిప్లా షేర్లు లాభపడగా.. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టీ, టాటామోటార్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.

# కవి సమయం

## స్వార్థపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి. స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది. అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది. దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు. తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి. అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

| మాసం : చైత్ర , తిథి : ప.11.42 పునర్వసు ప. 8.58 సా.వ. 4.33ల 6.04 | శనివారం 13-04-2019 |
|---|---|

a **మేషం** : స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. b **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల ఆంతరంగిక విషయాలలో తలదూర్చకండి. C **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరు లతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్త రిస్తాయి. d **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళు కువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. e **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. f **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అను కూలిస్తాయి. ప్రయాణాలు అను కూలిస్తాయి. g **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమాను బంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. h **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవు తారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. i **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. j **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రిమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధిక మవు తాయి. k **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మంద కొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోస పోయే ఆస్కారం కలదు. L **మీనం** : ఆర్థిక విష యాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికా రులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

# భక్తుల పాలిట పెన్నిధి కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి

శ్రీఆంజనేయస్వామి భక్తులపాలిట పెన్నిధి. నిత్యం రామ ధ్యానంలో వుండే ఆయనను స్మరిస్తే అన్ని రకాల భూత, ప్రేత, పిశాచ భయాలను పోగొడతాడు. ధ్యానముద్రలో స్వయంభువుగా వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి అవతరించిన క్షేత్రమే హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆలయం. వందల ఏళ్ల నుంచి భక్తులను దీవిస్తూ ధ్యానముద్రలో వున్న అంజ నాసుతుని దర్శనాన్ని చేసుకుంటే అన్ని రకాలుగా మంచి ఫలితాలు లభిస్తాయి.

ముఖ్యంగా సంతానం లేనివారు స్వామిని దర్శించి నిండుమనస్సుతో ప్రార్థిస్తే సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు.

రెండో ప్రతాపరుద్రునికి దర్శనం..


క్రీ.శ. 1148లో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించే రెండో ప్రతాపరుద్రుడు వేటాడుతూ అలసి ఇక్కడ ఒక రాయిపై విశ్రమిస్తాడు. కాసేపటికి అతనికి పులి గాండ్రింపు శబ్దాలు వినిపించడంతో అప్రమత్తుడ్కై విల్లంబులు ధరించి అక్కడకు వెళుతాడు.

అక్కడ ఏమి కనిపించకపోవడంతో తిరిగి రాయి వద్దకు వస్తాడు. మళ్లీ పులి గాండ్రింపు వినరావడంతో తిరిగి గాలిస్తాడు. అప్పుడు కూడా ఎలాంటి జంతువు కనిపించలేదు. అదే సమయంలో రామశబ్దం రావడంతో చేతులు జోడించి ఆ అద ృశ్యమూర్తిని ప్రార్థిస్తాడు. ధ్యానం చేస్తే దర్శనమిస్తానని ఆ మూర్తి స్వరం వినిపిస్తుంది. దీంతో రాజు అక్కడ ఏకాగ్రతతో ధ్యానం చేస్తాడు. కొద్దిసేపటికి ఇక లే నాయనా అంటూ స్వరం వినిపించడంతో రాజు కళ్లు తెరిచి ఆ శబ్దం వచ్చిన చోట వెతకగా ధ్యానాంజ నేయస్వామి విగ్రహం లభ్యమైంది.

పరమానందభరితుడ్కైన రాజు ఆ విగ్రహానికి పూజలు చేసి కోటకు తిరిగి వెళ్లిపోతాడు. ఆ రాత్రి కలలో స్వామివారు అతనికి ప్రత్యక్షమై తనకు ఆలయం నిర్మించమని ఆదేశిస్తారు. స్వామి అనుజ్ఞ ప్రకారం ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. స్వామివారిని అనంతరం కాకతీయ రాజులందరూ ఇష్టదైవంగా పూజించడంతో క్షేత్ర మహిమ అన్ని ప్రాంతాలకు వ్యాపించడంతో భక్తులు వేల సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చేవారు.

స్వామివారే హెచ్చరించారు..

17వ శతాబ్దంలో గోల్కొండ సామ్రాజ్యాన్ని మొగల్ పాలకుడు ఔరంగజేబ్ స్వాధీనం చేసుకున్నాడు. అతని సైన్యంలోని కొందరు ధ్యానాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అయితే స్వామి దివ్యశక్తితో వారు విజయం సాధించలేకపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఔరంగజేబ్



స్వయంగా దాడికి దిగాడు. ఈ క్రమంలో ఆలయం వద్దకు చేరుకోగా ఆలయం నుంచి పెద్ద స్వరంతో 'మందిర్ తోడ్‌నా హైతో పహలె తుమ్ కరో మన్‌ఘట్'(ఆలయాన్ని ధ్వంసం చేయాలనుకుంటే మనస్సును గట్టిగా చేసుకో) అని పలికింది. దీంతో ఔరంగజేబ్ తనకు కనపడమని కోరగా తాటిచెట్టు కంటే ఎత్తైన రూపం కనిపించడంతో అతను భీతిల్లి వెనుదిరిగాడు. కరో మన్‌ఘట్ అన్న పేరే కర్మన్‌ఘాట్‌గా మారింది.

నిత్యపూజలు

స్వామివారి ఆలయంలో నిత్యపూజలు జరుగు తుంటాయి. రోజూ వందలాది మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో పలు ఉపాలయాలను నిర్మించారు.

ప్రశాంతమైన వాతా వరణంలో వుండే ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని దర్శించుకుంటే



మనసుకు ప్రశాంతత చేకూరు తుంది. కొత్తగా కొనుగోలు చేసిన మోటార్ వాహనాలకు ఇక్కడ పూజ చేయిం చడం సంప్రదాయం. నిత్యం అనేక వాహనాలకు శకట పూజ జరుగుతుంది.

ఇలా చేరుకోవచ్చు

హైదరాబాద్ నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఆలయం వుంది.

దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌ల నుంచి చేరుకోవచ్చు.

మీర్‌పేట్, జిల్లెల్లగూడ, నాదర్‌గుల్, ఆర్.ఎన్.రెడ్డినగర్...తదితర శివారు ప్రాంతాలకు వెళ్లే సిటీ సర్వీసులు కర్మన్‌ఘాట్ మీదుగానే వెళుతాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

**ప్లాట్లు అమ్మకంనకు గలవు**

సబ్బవరం మండలంలో ఆరిపాక మెయిన్‌రోడ్డులో 22 సెంట్లు, 190 చ॥గ॥, 173 చ॥గ॥ ఇల్లు వుడా ప్లాట్లు మరియు పంచాయితీ ప్లాట్లు అమ్మకంనకు కలవు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9866955823; 8247641310

# పరవాడలో వైభవంగా శ్రీరాముని పందిరిరాట



పరవాడ : మండలకేంద్రమైన పరవాడలో శ్రీరామ నవమి మహోత్సవాలను పురస్కరించుకుని శుక్ర వారము రామాలయం వద్ద పందిరిరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పరవాడ తాజా మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు దంపతలు చేతులు మీదుగా జరిగింది. అనంతరము ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా శ్రీరామ నవమి మహోత్సవాలను నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పైల శ్రీనువాసురావు, సిరపురపు అప్పల నాయుడు, పైల పోతి నాయుడు (పెద్దింటి), పోతల అప్పల నాయుడు, చిరికి అప్పారావు, పైల హరేష్, చుక్క సన్యాశిరావు, రాజు, రమణాజీ తది తరులు పాల్గొన్నారు.

## నిరాశ పర్చిన ఇంటర్ ఫలితాలు

రోలుగుంట : మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తర్ణత ఫలితాలు నిరాశ కలిగించాయి. గతంలో లేని విధంగా ప్రస్తుతం ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఏడాది ప్రధమ సంవత్సరం ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఈసి గ్రూపుల నుంచి 182 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 55 మంది మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణ సాధించి కళాశాల మొత్తం 30శాతం సాధించింది. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నాలుగు గ్రూపుల నుంచి 177 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా 104 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో కళాశాల 68 శాతం, ఉత్తీర్ణత శాతం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బానోతు సుజాత తెలిపారు.

# అగ్నిప్రమాదంలో పాన్ షాప్ దగ్ధం



భీమునిపట్నం : సంగివలస మూడు అమ్మవార్ల గుడికి ఆను కొని ఉన్న పాన్ షాపు శుక్రవారం తెల్లవారుజామున సుమారు 1.46 నిముషాలకు అగ్ని ప్రమాదానికి గురై మంటల్లో దగ్ధమైంది. బాధితుల వివరాలు ప్రకారం దాసరి అప్పలనర్సమ్మ, ఆమె కుమారుడు దాసరి వెంకటేష్, సంగివలసలో నివాసం ఉంటూ, అక్కడగల మూడు అమ్మవార్ల గు డికి ఆనుకొని ఒక పాన్ షాపు పెట్టుకొని గత 25 ఏళ్ల నుంచి దానినే జీవానాధారంగా చేసుకొని జీవిస్తున్నారు. అయితే ఉదయం 1.46 నిముషాలకు తన షాపు అగ్ని ప్రమాదంలో కాలి పోతున్నదని, అక్కడ గల గుడి వాచ్‌మన్ ఫోను చేయగా హుటాహుటిన వెంకటేష్ సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే షాపులో ఉన్న విలువైన ఫ్రిజ్‌లు, డ్రింక్ బాటిల్స్, ఇటీవలే కొన్న సరుకులు కాలి బూడిదయ్యాయని వాటి విలువ సుమారు ఒక లక్ష యాభై వేల రూపాయలు ఉంటుందని బాధితుడు వెంకటేష్ తెలిపారు.

ఇంతలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంట లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై తనకు న్యాయం చేయ వలసిందిగా స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

# 10వేలు మెజార్టీతో సుబ్బరాజు గెలుపు ఖాయం

తాళ్లరేవు : ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలలో టీడీపీ అభ్యర్ధి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) 10వేల మెజార్టీతో గెలవడం ఖాయమని టీడీపీ సీనియర్ నాయకుడు, తాళ్లరేవు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మందాల గంగా సూర్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం మరలా రావడం ఖాయమని, 130 ఎంఎల్‌ఏ సీట్లు గెలవడం తథ్యమన్నారు. ఎంపీ స్థానాలు 22 సాధిస్తామన్నారు. సీఎం చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులకు ప్రజలు ఓటేశారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన తాగునీరు సరఫరా గ్రామీణ ప్రజలకు అందించారు. అలాగే రోడ్లు అభివృద్ధి చేశారని, అవినీతి లేని పాలన అందించారన్నారు. టీడీపీకి అన్ని వర్గాల ప్రజలు ఆదరణ లభించిందన్నారు. మహిళలు టీడీపీ వైపు మొగ్గు చూపితే జిల్లాలో వున్న 19 ఎమ్మెల్యే స్థానాలు టీడీపీ క్లీన్ చీప్ చేస్తుందన్నారు. క్రాస్ ఓటింగ్ జరిగితే ఇబ్బందులు కలుగుతాయన్నారు. టీడీపీ మరలా గెలిస్తే అమరావతి శరవేగం అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. రాజధాని నిర్మాణం పూర్తి అవ్వాలంటే చంద్రబాబు సీఎంగా వుంటేనే సాధ్యమన్నారు.

# జగన్ సీఎం అవ్వడం తథ్యం

తాళ్లరేవు : వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎం అవడం తథ్యమని తాళ్లరేవు వైఎస్‌ఆర్‌సీపీ వాణిజ్య విభాగ కన్వీనర్ నాగేశ్వరరావు జోస్యం చెప్పారు. ఈ నెల 11న జరిగిన ఎన్నికలలో రాష్ట్రంలో ఓటర్లు జగన్‌కు ఓటు వేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో అధికారంలోకి రావడానికి సుమారు 600 హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. నేడు జగన్ ఇచ్చిన హామీలకు ప్రజలు ఓటు వేశారన్నారు. రాజన్న రాజ్యం రావాలని ప్రజలు ఆశిస్తున్నానన్నారు. ముమ్మిడివరం అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్‌ఆర్‌సీపి అభ్యర్ధి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ 25వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారన్నారు. పొన్నాడకు అన్ని వర్గాల ప్రజలు బలం వుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఓట్లు చీల్చు కుంటూ మెజార్టీ మరింత పెరిగే అవకాశం వుందన్నారు. జిల్లాలో వైఎస్‌ఆర్‌సీపీకి 14 సీట్లు, ఎంపీ 23 సీట్లు వస్తాయని, అలాగే రాష్ట్రంలో 142 సీట్లు రావడం జరుగుతుందన్నారు. మిగిలిన స్థానాలు టీడీపీ, జనసేనలకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వస్తాయన్నారు. మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారని ఆయన అన్నారు.

# కొయ్యూరు జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



9.10 పాయింట్లు సాధించిన కె.భరత్‌కుమార్

కొయ్యూరు : కొయ్యూరు జూనియర్ కళాశాలలో ప్రధమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 111 మందికి 55 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 110 మందిలో 63మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపిసికి చెందిన కె.భరత్ కుమార్ 9.10 పాయింట్లు సాధించారు.

# చలివేంద్రం ప్రారంభం

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చండి




చినవాల్తేరు : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ప్రారంభించాలని విశాఖ తూర్పు పరిరక్షణ సమితి కన్వీనర్ డొక్కర ప్రసాద్, పంచదార్ల శ్రీనివాస్‌లు తెలియజేశారు. ఈ చలివేంద్రంలో చల్లని మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రయాణీకులు, ప్రజలు, పాదచారులు ఈ చలి వేంద్రాలను విరివిగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో స్థానికులు విరివిగా పాల్గొని ప్రజా సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తొలిసారిగా ఒకే పోలీస్‌తో ఎన్నిక!



పాలకొండ : పాలకొండ మండల పరిధిలోని పొట్లి హైపర్‌క్రిటికల్ గ్రామంగా పోలిస్ రికార్డుల్లో ఉంది. పోలింగ్‌కేంద్రం సంఖ్య 206. ఈ గ్రామంలో ఎన్నికలంటే అధికారులు, పోలీసులుకు ముచ్చెమటలు పట్టిస్తాయి. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ కేంద్రబలగాల నిఘా నీడన ఎన్నికలు నిర్వహించారు. అటు వంటి ఈ గ్రామం గత అయిదేళ్లుగా తగాదాలకు దూరంగా ఉంటూ వస్తోంది. దీంతో అధికారులు ఒకే పోలీస్‌తో ఈ మారు ఎన్నికలు నిర్వహించారు. పొట్లి గ్రామంలో ఒకే పోలీస్‌తో ఎన్నికలు నిర్వహించడం గ్రామ చరిత్రలో మొదటి సారంటున్నారు గ్రామానికి చెందిన పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావుతోపాటు పలువురు గ్రామస్థులు. గురువారం జరిగిన ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి.

# సీతారాముల కల్యాణం సందర్భంగా హోమంలో పాల్గొన్న దంపతులు



ములగాడ: సీతారాముల కళ్యాణం మహోత్సవాల సందర్భంగా మల్కాపురం నగరాల సంఘం వద్ద శ్రీ శ్రీ శ్రీ కోదండ రామాలయం ఆలయంలో పూర్వం నుంచి వచ్చే ఆచారం ప్రకారం నేడు సీతారామ కళ్యాణం జరుగుతుంది అనగా ముందు రోజు ఆలయంలో హోమం చేయడం ఆనవాయితీగా శుక్రవారం సాయంత్రం బోగవిల్లి నాగభూషణం దంపతులు రమేష్ దంపతులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం హోమంలో వేదపండితులు పాల్గొని వేద మంత్రాలతో హోమం చేస్తూ సీతారాములు వారి విగ్రహాలను వినూత్న రీతిలో అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు అనంతరం స్వామి వారి యొక్క తీర్థప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు.

# అన్నవరంలో ప్రశాంతంగా జరిగిన పోలింగ్



## 70 శాతం పోలింగ్ నమోదు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో ఎన్నికలు వాతావరణం సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.అయితే పోలింగ్ బూత్ ల వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బంది లేకపోవడంతో ఇక్కడ ఇరు పార్టీల నాయకులే ఎన్నికల అధికారులుగా చెలామణి అయ్యారు.ఏది ఏమైనా పోలింగ్ బూత్ ల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం కొంచెం మంద కొడిగా ఉన్నప్పటికీ 10 గంటలకి ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎండను కూడా లెక్క చేయ కుండా మహిళలు. ముసలివారు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు.కాని పలువురు ఓట్లు గల్లంతయ్యాయి. .దీనివలన చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకొండానే వెనుదిరిగారు.అదేవిధంగా కొన్ని బూత్ లలో ఈవీఎంలు మొరాయించాయు.అయితే ఇక్కడ మొత్తం ఓటర్లు 9,561 మంది ఉండగా మొత్తం 6,732 మంది ఓట్లు నమోదు అయ్యాయి.అనగా 70 శాతం ఓట్లు నమోదు అయినట్లుగా ఎన్నికల అధికారులు వెల్లడించారు.అయితే గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి అన్నవరం ఓటింగ్ శాతం తగ్గిందనే చెబుతున్నారు.

# వేడుకగా శ్రీరామనవమి ఉత్సవాలు

ఇచ్ఛాపురం : టి.బరంపురం గ్రామంలో జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం అభిషేకాలు, సహస్రనామార్చన, కుంకుమార్చనలు జరిపించారు.

# తెదేపా విజయం ఖాయం

## రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నిమ్మాడ : సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా విజయం ఖాయమని రాష్ట్ర మంత్రి, టెక్కలి నియోజకవర్గ తెదేపా అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్, ప్రధాని, ప్రతిపక్షంతో పాటు అంతా ఒక్కటై ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో అందరూ స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొనడం తెదేపా విజయానికి సంకేతమన్నారు. మొరాయిస్తున్న ఈవీఎంలు, ఓటింగు జాప్యంపై మాట్లాడుతూ పలు పర్యాయాలు కమిషన్ ద ృష్టికి తీసుకెళ్లామన్నారు. అభివ ృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే తెదేపా వెంటే ప్రజలు ఉన్నారని ఎన్నికలు నిలుస్తాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# పెండ్లిముస్తాబులో రత్నగిరి క్షేత్రపాలకులు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా రత్నగిరి క్షేత్ర పాలకులైన శ్రీ సీతారాములను శుక్రవారం పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా రామా లయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి సాయంకాలం 4గంటలకు పెండ్లిపెద్దలైన శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వధూవరులైన సీతారాములను పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెల ముస్తాబులో ఆశీనులుచేశారు. ఆలయ ప్రధానార్చకులు కొండవీటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యా హవచనం గావించారు. ఉల్లూకల గౌరీపూజ చేపట్టగా ముత్తైదువలు



పసుపుకొమ్ములు దంచారు. నీరాజన మంత్రపుష్పాలు, వేదపండిత ఆశీర్వచనం అనంతరం హాజరైన భక్తులకు స్వామివారి ప్రసాదం, వడపప్పు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్ ఈరంకి జగన్నాధరావు, ఇతర ఆలయ అధికారులు, వేదపండితులు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాగా నేటి ఉదయం 9 గంటలకు రామాలయం ప్రక్కన గల శాశ్వత కళ్యాణవేదికపై లోకకళ్యాణార్ధం, భక్తజన సంరక్షణార్ధం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కళ్యాణ వేడుకను పెద్దఎత్తున భక్తులు విచ్చేసి తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అధికారులు కోరారు.

# గురుకులం విద్యార్థిని మృతి




సీతంపేట : సీతంపేటలోని మినీ గురుకులంలో రెండవ తరగతి చదువుతున్న సవర గీత(7) అనే గిరిజన విద్యార్థిని మృతి చెందింది. గురుకులం సెల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు తెలియజేసిన వివరాలకు మేరకు... శంభాం పంచాయతీ బీరపాడుకు చెందిన గీత మినీ గురుకులంలో చదువుతోంది. వారం రోజుల క్రితం తలకు పుండ్లు కావడంతో సీతంపేట ఆసుపత్రికి తీసుకువెల్లి మందులు అందజేశారు. అయితే బుధవారం రాత్రి వాంతి చేసుకోవడం, అదే సమయంలో వాంతిలో రక్తం పడిందని తెలిపారు. వెంటనే సీతంపేట ఆసుపత్రికి తీసుకువెల్లగా పల్స్ డౌన్ అయి ఇబ్బందిగా మారడంతో ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరే సమయానికే గీత మ ృతి చెందినట్లు వైద్యాధికారి తెలియజేశారని చెప్పారు. గుండెకు సంబంధించిన వ్యాధి అయి ఉంటుందని వైద్యులు భావించారని తెలిపారు. మృత దేహాన్ని స్వగ్రామానికి కుటుంబ సభ్యులు తీసుకువెల్లారని తెలిపారు.

## మహోన్నతులు

# జ్యోతిరావు పూలే

జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో కె.నరేంద్రప్రసాద్



శ్రీకాకుళం : జ్యోతిరావు పూలే మహోన్నతులని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కె.నరేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమీపంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణిచివేతకు గురైన బడుగు, బలహీనె వర్గాల్లో ఆత్మస్థైర్యం కల్పించిన మహాను భావుడు పూలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రపతిరావు, కార్యదర్శి బి.దేవ భూషణరావు, ప్రతినిధులు మూల నారాయణరావు, అమీరుల్లాబేగ్, గంజి ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి




విశాఖపట్నం : 2019 మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయ భేరి మ్రోగించారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీలో 10 కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు 11 మంది, 9.83 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు 8 మంది, బైపీసీ లో 10 కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు 10 మంది, మరియు 11 మంది విద్యార్థులు 9.83 గ్రేడ్ పాయింట్లు సాధిం చారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీలో లో 10 కి 10 గ్రేడ్





పాయింట్లు ఇద్దరు సాధిం చగా, 7గురు విద్యార్థులు 9.94 గ్రేడ్ పాయింట్లు సాధిం చారు. దీఇ్యా.జ. లో 10 కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యా ర్థులు నలుగురు మరియు ముగ్గురు విద్యార్థులు 9.95 గ్రేడ్ పాయింట్లు సాధిం చారు. ఎంఇసీ లో ఒకరు 10 కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఇసీ, సిఇసీలో గ్రూపులతో పాటు జాతీయ మరియు రాష్ట్రీయ పోటీ పరీక్షలకు సీనియర్ అధ్యాపకులు అందించిన శిక్షణతో మా విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ఫలితా లను సాధించారని సెక్రటరి కరస్పాండెంట్ టి. రవిశంకర్ వర్మ తెలిపారు.

## ఈవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రత - జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

విజయనగరం : సార్వత్రిక ఎన్నికలును ప్రశాంతంగా ముగియడంతో తొమ్మిది అసెంబ్లీ, మూడు పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన ఈ.వి.ఎం.లును పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగు రూంలకు తరలించి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ శక్రువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలలో విజయనగరం పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఈ.వి.ఎం. లను,మహారాజా ఇంజనీరింగు కళాశాలలో అరకు పార్లమెంటు, కురుపాం, పార్వతీపురం, సాలూరు మరియు ఎస్. కోట అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఈ.వి.ఎం.లను, జె.న్.టి.యు కళాశాలలో విజయనగరం పార్లమెంటు, బబ్బిలి, గజపతినగరం అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఈ.వి.ఎం.లను, లెండి ఇంజనీరింగు కళాశాలలో విజయనగరం పార్లమెంటు, నెల్లిమర్ల, చీపురుపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల ఈ.వి.ఎం.లను భద్రపర్చినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ.వి.ఎం.లను భద్రపర్చేందుకు ప్రత్యేకం ఏర్పాటు చేసిన స్ట్రాంగు రూంలలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సి.ఆర్.పి.ఎఫ్, ఎపిఎస్పీ మరియు ఆర్మ్డ్ రిజర్వు బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి, వాటినినిరంతరం పర్యవేక్షించేందుకు ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రిని ప్రత్యేక అధికారిగా నియమించామని జిల్లా ఎస్పీ తెలిపారు. విజయనగరం పోలీసు శిక్షణ కళాశాల స్ట్రాంగు రూంలో భద్రపర్చిన విజయనగరం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈ.వి.ఎం.లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పరిశీలించి, భద్రతా ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఈ.వి.ఎం. లనుభద్రపర్చడం చాలా ముఖ్యమైన విధి అని, భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వద్దని, భద్రతా సిబ్బందికి పలు సూచనలు జిల్లా ఎస్పీ చేసారు. అనంతరం, విజయనగరం ఆర్మ్డ్ రిజర్వు పోలీసులతో సమావేశమై సార్వత్రికఎన్నికలను ప్రశాంతయుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తక్కువ మంది పోలీసు సిబ్బందితో నిర్వహించడంలో సఫలీకృతం అయ్యామన్నారు. ఎన్నికలను ప్రశాంతయుత వాతావరంలో నిర్వహించడంలో సివిల్, ఆర్మ్డ్ రిజర్వు పోలీసు అధికారులు, సిబ్బంది పాత్ర ఎనలేనిదని, వారి కృషిని అభినందిస్తూ, ఎన్నికల విధులు ర్వహించిన అధికారులు, సిబ్బందికి రివార్డులను త్వరలో అందజేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఎన్నికల నోటిఫికేషను వెలువడక ముందు నుండే పోలీసుశాఖ ఎన్నికలకు సమాయత్తం కావడం, పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు చర్యలు సత్ఫలితాలిచ్చాయని ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలోసమస్యలు సృష్టించే ముఖ్య వ్యక్తులను పార్టీలకు అతీతంగా గుర్తించి, వారిని బైండోవరు చేయడం, సమస్యాత్మక గ్రామాల్లో పారామిలటరీ బలగాలతోకవాతు నిర్వహించడం, ప్రజలను స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కొనేందుకుగాను భరోసా కల్పించడం, సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు దోహద పడ్డాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు.

# నేడు సీఈసీతో చంద్రబాబు భేటీ



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు.. దిల్లీ వేదికగా పోరాటానికి సమాయత్త మయ్యారు. దీనిలో భాగంగా శనివారం ఆయన దిల్లీకి పయనం కానున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారులను కలిసి రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ జరిగిన తీరును వారి దృష్టికి తీసుకెళ్లి మరోసారి తన నిరసన తెలప నున్నారు. రేపు ఉదయం 9గంటలకు చంద్రబాబు దిల్లీకి చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (సీఈసీ) సునీల్ అరోడా, ఇతర కమిషనర్లను కలవనున్నారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడతారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తీరు.. ఈవీఎంల మొరాయింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు.. తదితర పరిణామాలన్నింటినీ ఈసీఐ దృష్టికి తీసుకెళ్లి నిర్వహణ వైఫల్యాలపై ప్రశ్నించనున్నారు. అలాగే, వీవీప్యాట్‌ల లెక్కింపు సంఖ్యను సైతం పెంచాలని చంద్రబాబు కోరే అవకాశం ఉంది.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు వినియోగిస్తున్న సామాన్లను చిందర వందర చేసిన ఎన్నికల సిబ్బంది



కంచరపాలెం : జీవీఎంసీ 35 వ వార్డు పరిధి జై ప్రకాష్ నగర్ వద్ద నున్న అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం జరిగిన ఎన్నికలకు బూత్ నంబర్ .... గా ఎన్నికల అదికారులు కేటాయించారు . అయితే ఎన్నికలల్లో పాల్గున్న సిబ్బంది అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు వినియోగిస్తున్న సమాన్లు చిందర వందరగా పడేసి అన్నం తిన్న వ్యర్థాలను ఎక్కడికక్కడే వదేలేసి వెల్లిపోయారు. శుక్రవారం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లిన అంగన్వాడీ సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో చిన్నా రులు వినియో గిస్తున్న వస్తువులు చిందర వందరగా పడేసి ఉండటంతో ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామని పెర్కొన్నారు . అదికారులు స్పందించి చర్యలు చెప్పట్టాలని చిన్నారుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

బలిజిపేట: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వెంగాపురం పీఎస్ఎన్ జూనియర్ కళాశాల, చిలుకలపల్లి రంగుముద్రి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో ఎనిమిది మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10/10 గ్రేడింగ్ సాధించారు.

రంగుముద్రి కళాశాలకు చెందిన ఇద్దరు 10/10 గ్రేడింగ్ సాధించారు. ద్వితీయ సంవత్సరంలో పీఎస్ఎన్ కళాశాలకు చెందిన కె.హిమబిందు 9.95, పి.దీపిక 9.86, రంగుముద్రి కళాశాలకు చెందిన కె.అనిత 9.95, ఎన్.ప్రవీణ్ 9.86 గ్రేడింగ్‌ను సాధించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

# విస్త్రతంగా మల్లాడి ఎన్నికల ప్రచారం



యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్య లింగంకు మద్దతుగా పుదుచ్చేరి ఆరోగ్య శాఖమంత్రి మల్లాడి కృష్ణారావు విస్త్రతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం తీర ప్రాంతాలైన సావిత్రినగర్, గిరియంపేటలలో రోడ్‌కార్నర్ సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్‌పార్టీ వి.వైద్యలింగంకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో వున్న బీజేపీకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలన్నారు. కేంద్రంలో వున్న బీజేపీ ప్రభుత్వం పుదుచ్చేరిలో అధికారంలో కాంగ్రెస్‌పార్టీ చేసే ప్రజా అభివృద్ధి పనులను అడ్డుకోవడానికి ఢిల్లీ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయిన కిరణ్‌బేడిని లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించి అడ్డుకుంటూ ప్రజల జీవితాలలో చెలగాటం ఆడుతున్నారని, అటువంటి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్, అన్నా డిఎంకె పి.వెంకి, ఉమ్మడి అభ్యర్థిని ఈ ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలు అందుతాయన్నారు. కేంద్ర నిధులులో యానాం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నా రాజకీయ జీవితంలో అన్ని రాష్ట్రాలలోని నాయకులను చూసి ఎంతో గర్వపడ్డానన్నారు. కాని యానాంలో వున్న ప్రతిపక్షం పార్టీల నాయకులు యానాం అభివృద్ధికి నిధులు ఇవ్వవద్దని 29 సం॥రాలుగా చూస్తున్నానన్నారు. అన్ని రంగాలలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులకు ఓటర్లు పట్టం కట్టాలన్నారు. పుదుచ్చేరికి ఆర్థిక ఇబ్బందులు కలగడానికి కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి తీసుకొచ్చామన్నారు. ఈ ప్రచారంలో కాలాడి శ్రీను, కర్రి స్వామి, చింతా రామమూర్తి, కాలాడి సత్తిబాబు, చింత వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భాజపాతోనే అభివృద్ధి శకం ప్రారంభం : అమిత్‌షా



కెవ్ఝాంఝర్(ఒడిశా): ప్రధానిగా నరేంద్ర మోదీకి దేశ వ్యాప్తంగా మద్దతు ఉందని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా అన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం మోదీ నామ స్మరణతో మారుమోగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒడిశాలో శుక్రవారం జరిగిన పార్టీ ప్రచార కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే ప్రతిపక్ష కాంగ్రెస్‌పై కూడా ఆయన విరుచుకుపడ్డారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశంలోని పేదరికాన్ని ఏమాత్రం నిర్మూలించలేకపోయిందని విమర్శించారు. భాజపా పాలనతోనే దేశంలో అభివృద్ధి శకం మొదలైందన్నారు. ఎన్డీయే హయాంలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయన్నారు. పేదరిక నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే ఒడిశాలో అధికార పార్టీ బిజు జనతా దళ్(బీజేడీ)పైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఇక్కడి ప్రజలు మాత్రం పేదవారిగానే మిగిలిపోయారన్నారు. బీజేడీ ప్రభుత్వం అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ఒడియా భాష రాకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. భాజపా అధికారంలోకి వస్తే కెవ్ఝంఘర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. అలాగే అటవీ ఉత్పత్తుల్ని కనీస మద్దతు దరతో స్థానికుల నుంచే కొనుగోలు చేస్తామని ప్రకటించారు.

# మళ్లీ బీజేపీని రానీయొద్దు: మమత



కుర్సెయాంగ్: ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలదే కీలక భూమిక అని, కేంద్రంలో తదుపరి ప్రభుత్వం ఏర్పాటుకు అంతా కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. 'నాయకుడెవరనేది ముఖ్యం కాదు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి' అని ఆమె అన్నారు. శుక్రవారంనాడు ఇక్కడ జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ప్రజలు ఓటు వేయకుంటే రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం వారికి అసాధ్యమవుతుందన్నారు. జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్సీ)పై మమత మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే ఎన్ఆర్సీని అమలు చేసి తీరుతామని వారు (బీజేపీ) చెబుతున్నారని, అయితే తమ పార్టీ (టీఎంసీ) మాత్రం ఎన్ఆర్సీని మొదట్నించీ వ్యతిరేకిస్తూ వస్తోందని గుర్తుచేశారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్ఆర్సీ అమలును అనుమతించే ప్రసక్తే లేదంటూ పరోక్షంగా అమిత్‌షా వ్యాఖ్యలను తిప్పికొట్టారు.

కేంద్రంలో బీజేపీకి మరోసారి అధికారం ఇస్తే దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీని అమలు చేస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా గురువారంనాడు పశ్చిమబెంగాల్‌లోని రాయ్‌గంజ్ ర్యాలీలో ప్రకటించారు

# ఎన్నికల నిర్వహణ తీరుపై అఖిలప్రియ ఆగ్రహం



ఆళ్లగడ్డ: కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ఎన్నికల నిర్వహణ తీరుపై మంత్రి భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు, పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వైకాపా నేతల హింసపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తాను సమాచారం అందించినప్పటికీ వారు స్పందించలేదని విమర్శించారు. ఆళ్లగడ్డలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఓటు వేసేందుకు వచ్చిన ప్రజల ముందే తనను వైకాపా అభ్యర్థి బెదిరించారన్నారు. కేవలం ఆళ్లగడ్డలోనే కాకుండా రాష్ట్రంలో అనేకచోట్ల జరిగిన గొడవలకు కారణం వైకాపా వాళ్లకు ఆ స్వేచ్ఛనివ్వడమేనని ఆరోపించారు. ఘర్షణలకు సంబంధించిన వీడియోలను ఎస్పీ, ఈసీకి పంపినట్టు ఆమె వెల్లడించారు. అహోబిలంలో నిన్న ఉదయం గొడవలు జరుగుతున్నాయని చెప్పినా బలగాలు పంపలేదని, దీంతో మళ్లీ సాయంత్రం అక్కడ ఘర్షణ తలెత్తిందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

## విశాఖలో జెసిఐ రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ స్పీకింగ్‌లో శిక్షణ



విశాఖపట్నం : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషన్, జోన్-4 జెసీస్‌కి రాష్ట్రస్థాయిలో అద్భుత వ్యక్తిగా శిక్షణా తరగతులు మూడు రోజుల పాటు విశాఖలో అంబికా సీ గ్రీన్‌లో జరుగుతుండగా శుక్రవారం ప్రారంభోత్సవ వేడుకలలో ఏయూ డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఒక వ్యక్తి మంచి వ్యక్తిగా మారటానికి బాహ్య సౌందర్యంతో పాటు అంత: సౌందర్యం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జెసిఇ జోన్-4 అధ్యక్షులు జ్యోతి శ్రీధర్, రఘురామ్, సురేష్ గొంప, కవితాపాండే పాల్గొన్నారు. ఈ శిక్షణకు జాతీయ శిక్షకులు జెసి కౌశిక్ కల్లూరి ముఖ్య శిక్షకులు కాగా, నాగరెడ్డి, రంజన్ సహ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

# మూడోసారి..జెట్ విఫలం

ముంబై: రుణ సంక్షోభంలో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్ కష్టాలు ఇప్పట్లో వీడేటట్లు కనిపించడం లేదు. డిబెంచర్లను జారీ చేయడం ద్వారా సేకరించిన నిధులను తిరిగి చెల్లింపులు జరుపడంలో మరోసారి విఫలమైంది సంస్థ. జనవరి నుంచి ఇలా నిధుల చెల్లింపులు జరుపలేకపోవడం ఇది మూడోసారి. అయినప్పటికీ కంపెనీ చైర్మన్ నరేష్ గోయల్..ఉద్యోగుల్లో సడలుతున్న నమ్మకాన్ని తగ్గించడానికి ప్రయత్నించారు. 16 వేల మంది సిబ్బందికి ఆయన లేఖరాశారు. సంస్థను గట్టెక్కించడానికి ప్రయత్నాలను చేస్తున్నానని, మరికొద్ది రోజుల్లో బెయిల్ అవుట్‌కు సంబంధించి కీలక ప్రకటన రావచ్చునని ఆ లేఖలో గోయల్ పేర్కొన్నారు.

కంపెనీలో అత్యధిక వాటా కొనుగోలు చేసిన ఎతిహాద్ ఎయిర్‌వేస్‌తోపాటు బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)తో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. ఎప్పటిలోగా ఈ చర్చలు కొలిక్కి వచ్చేదానిపై ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. యూఏఈకి చెందిన ఎతిహాద్ ఎయిర్‌లైన్స్‌కు 24 శాతం వాటా ఉన్నది. నిధులకు సంబంధించి తాత్కాలికంగా ఏర్పడిన ఇబ్బందులకు త్వరలో పరిష్కారం లభించనున్నదని, ఈ నెల 19 లోగా వడ్డీలను చెల్లించే అవకాశాలు మాత్రం లేవన్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.8,200 కోట్ల అప్పు ఉన్నది. ఈ పరిస్థితుల నుంచి ఈ వారంలోనే గట్టెక్కే అవకాశాలున్నాయని ఎస్‌బీఐ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు లీజు డబ్బులు చెల్లించకపోవడంతో 41 విమాన సర్వీసులు నేలపట్టునే నిలిచిపోయాయి.

ఇదే క్రమంలో అబుదాబికి నడుపుతున్న సర్వీసును కూడా రద్దు చేసింది. పైలెట్లు, సీనియర్ మేనేజ్‌మెంట్, ఇంజినీర్ల జీత భత్యాల చెల్లింపులపై గోయల్ స్పందిస్తూ ..మీ జీతభత్యాలకు ఎలాంటి ఢోకాలేదు.. అన్ని పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత మీ జీతాలు చెల్లిస్తానని ఈ లేఖలో పేర్కొన్నారు.

డిసెంబర్‌లో 87.5 శాతం వరకు జీతాలు అందుకున్న సిబ్బంది..జనవరి, ఫిబ్రవరి నెలలో ఇప్పటికే పొందారు. మరోవైపు కంపెనీ భవిష్యత్తు, ఇతర విషయాలపై చర్చించడానికి మంగళవారం కంపెనీ ఉద్యోగ సంఘాలు భేటీకాబోతున్నాయి.

# మారుతికి తప్పని తిప్పలు

న్యూఢిల్లీ: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీకి కూడా తిప్పలు తప్పడం లేదు. దేశవ్యాప్తంగా కార్లకు డిమాండ్ అంతకంతకు పడిపోవడంతో ఫిబ్రవరిలో సంస్థ ఉత్పత్తిని 8 శాతానికి పైగా తగ్గించుకున్నది. సూపర్ క్యారీ ఎల్‌సీవీతోపాటు 1,48,959 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన 1,62,524 యూనిట్లతో పోలిస్తే 8.3 శాతం తగ్గాయని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. వీటిలో ప్యాసింజర్ వాహనాలైన ఆల్టో, స్విఫ్ట్, డిజైర్, విటారా బ్రెజ్జాల ఉత్పత్తి 8.4 శాతం కోత పెట్టడంతో 1,47,550లకు పడిపోయాయి. కానీ, కంపెనీకి చెందిన వ్యాన్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో 16,898 యూనిట్లను ఉత్పత్తి చేసింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 22.1 శాతం పెరిగాయి. దీనిపై కంపెనీ ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు.

జనవరి నెలలో కంపెనీ1,83,064 యూనిట్ల కార్లను ఉత్పత్తి చేసింది. జనవరి 2018లో ప్రొడక్షన్ చేసిన 1,58,396లతో పోలిస్తే 15.6 శాతం పెరుగుదల కనిపించింది. గడిచిన నెలలో కంపెనీ విక్రయాలు 0.9 శాతం తగ్గి 1,39,100 యూనిట్లకు పరిమితమవగా, జనవరిలో 1.1 శాతం పెరిగాయి.

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటం, మరోవైపు వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిలో ఉండటం, చమురు ధరలు పెరుగుతుండటంతో కార్లను కొనుగోలు చేయడానికి కస్టమర్లు జంకుతున్నారు.

# కారులో సాలీడు కనిపించిందని ఈ మహిళ ఏం చేసిందంటే?



సాలీడును చూసి మీరు భయపడతారా? ఎహె.. ఊరుకోండి. సాలీడును చూసి కూడాఎవరైనా భయపడతారా? అదేమన్నా పామా? తేలా? భయపడటానికి. అది మనుషులను ఏం చేయదు కదా అంటారు కదా. మరి.. న్యూయార్క్‌లోని ఓ మహిళ మాత్రం కారులో స్పైడర్ కనిపించిందని ఏకంగా కారును రాయికి ఢీకొట్టింది. ఇంకేముంది కారు ముందు భాగం మొత్తం డ్యామేజ్ అయింది. స్పైడర్‌ను చూసి భయపడినందుకు ఆ మహిళ భారీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. అంతేనా.. తన కాలు కూడా విరిగిపోయింది. సాలీడును చూడగానే కారు కంట్రోల్ తప్పిందట. అంతే.. ఫలితం ఊహించకుండా అయిపోయింది.

ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు.. ఆ మహిళకు అరాక్నోఫోబియా ఉన్నట్లు తేల్చారు. ఈ ఫోబియా ఉన్నవాళ్లు సాలీడును చూడగానే వణికిపోతారు. భయపడిపోతారు. అప్పుడు వాళ్లు ఏం చేస్తారో వాళ్లకే తెలియదు. నిజానికి కారులో ఆమెకు కనిపించింది చిన్న సాలీడేనట. కానీ.. ఆ డ్రైవింగ్ చేస్తుండగా.. సడెన్‌గా ఆ సాలీడును చూసి భయానికి గురవడంతో కారు కంట్రోల్ తప్పి యాక్సిడెంట్ అయిందని పోలీసులు తెలిపారు.

అయితే.. సాలీడు వల్ల ఇలాంటి ఘటనలు జరగడం ఇదే మొదటిసారేమీ కాదు.. గత సంవత్సరం అంటే 2018 లో ఇలాగే తమ ఇంట్లో ఉన్న సాలీడులను వెళ్లగొట్టడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులు తమ ఇళ్లనే తగులబెట్టుకున్నారు.

# ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్

## -హైదరాబాద్‌సహా దేశంలోని 8 నగరాల్లో సర్వే

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాలకు పెద్ద ఎత్తున డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో గతంతో పోల్చితే ఆఫీస్ స్పేస్ లీజింగ్ దాదాపు 2.5 రెట్లు ఎగిసింది. 13 మిలియన్ చదరపు అడుగులకు చేరినట్లు ప్రాపర్టీ కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ (సీఅండ్‌డబ్ల్యూ) తా జాగా వెల్లడించింది. నిరుడు 5.3 మిలియన్ చదరపు అడుగులకే ఆఫీస్ స్పేస్ లిజింగ్ పరిమితమైనట్లు స్పష్టం చేసింది. కాగా, కో-వర్కింగ్, ఐటీ రంగాల నుంచి భారీ ఆదరణ కనిపించిందని పేర్కొన్నది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్), ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాల్లో సీఅండ్‌డబ్ల్యూ అధ్యయనం జరిగింది. ఈ ఏడాది అన్ని మార్కెట్లు గొప్పగా ప్రారంభమయ్యాయి. ఆఫీస్ స్పేస్ లీజింగ్ కార్యకలాపాలు ఆరంభం నుంచి జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే దేశంలోని ప్రధాన నగరాల్లో జనవరి-మార్చి వ్యవధిలో కార్యాలయ స్థలాల లీజింగ్ నిరుడు ఇదే సమయంతో పోల్చితే సుమారు 2.5 రెట్లు ఎగబాకింది అని సీఅండ్‌డబ్ల్యూ ఇండియా అధిపతి, ఎండీ అన్షుల్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 8 ప్రధాన నగరాల్లో 13 మిలియన్ చదరపు అడుగుల మేర ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగినట్లు తేలితే.. అందులో హైదరాబాద్ వాటా 1.41 మిలియన్ చదరపు అడుగులు. గతంతో పోల్చితే మూడు రెట్లు ఎగిసింది. ఇక అత్యధికంగా బెంగళూరులో 5.03 మిలియన్ చదరపు అడుగుల లీజింగ్ జరిగింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ (ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా)లో 2.79 మిలియన్ చదరపు అడుగుల లీజింగ్ జరుగగా, ముంబైలో 1.57 మిలియన్ చదరపు అడుగులు, కోల్‌కతాలో 3,58,500 చదరపు అడుగులు లీజైంది. అతి తక్కువ వ ృద్ధితో చెన్నైలో 10,12,662 మిలియన్ చదరపు అడుగులకు డిమాండ్ ఏర్పడింది. మరోవైపు పుణెలో 19 శాతం తగ్గి 7,23,156 చదరపు అడుగులకే ఆఫీస్ స్పేస్ లీజులు పరిమితం అవగా, అహ్మదాబాద్‌లో 10 శాతం క్షీణతతో 86,700 చదరపు అడుగులుగా నమోదైంది. కో-వర్కింగ్ సెగ్మెంట్‌లో ఈసారి వ ృద్ధిరేటు 20 శాతం నమోదైందని ఈ సందర్భంగా జైన్ చెప్పారు. గతేడాది జనవరి-మార్చిలో దాదాపు 7 శాతంగానే ఉందన్నారు. పంచుకున్న ఆఫీస్ స్పేస్‌లో స్వతంత్రంగా లేదా సమష్ఠిగా వ్యక్తులు పనిచేయడమే కో-వర్కింగ్ సెగ్మెంట్.

## చెత్తకుప్పలో పసికందు..

# పీక్కుతున్న కుక్కలు..



భువనేశ్వర్ : నెలలు నిండని పసికందును చెత్తకుప్పలో పడేశారు. ఆ శిశువును కుక్కలు పీక్కుతిన్నాయి. ఈ సంఘటన ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.

రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్ప వద్ద కుక్కలు నెలలు నిండని పసికందును పీక్కుతింటున్న ద ృశ్యాలను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. క్షణాల్లో అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఆ పసికందు మ ృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గిరిజన యువతిగా...



దక్షిణాది చిత్రసీమలో వైవిధ్యమైన కథలకు ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తుంటుంది నిత్యామీనన్. హీరోయిన్‌గా మాత్రమే నటించాలనే పరిమితులు విధించుకోకుండా నటనకు ఆస్కారం ఉన్న విభిన్నమైన పాత్రలతో ప్రతిభను చాటుకుంటున్నదామె. తాజాగా ఎస్.ఎస్.రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఆమె కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. రామ్‌చరణ్,ఎన్టీఆర్ కథానాయకులుగా దాదాపు నాలుగు వందల కోట్ల వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ అభిమానుల ద ృష్టిని ఆకర్షిస్తున్నది. స్వాతంత్ర్య సమరయోధులు కొమరం భీం, అల్లూరి సీతారామరాజు జీవితాలకు కాల్పానిక అంశాలను జోడించి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో నిత్యామీనన్ ఓ కీలక పాత్రను పోషించనున్నట్లు తెలిసింది.

గిరిజన యువతిగా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌లో ఆమె పాత్ర కనిపించనుందని సమాచారం. నిడివి తక్కువైనా శక్తివంతమైన పాత్ర కావడంతో దర్శకుడు రాజమౌళి ...నిత్యామీనన్‌ను ఎంచుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పూణేలో జరుపనున్న తదుపరి షెడ్యూల్‌లో ఆమె పాల్గొననున్నట్లు సమాచారం. అలియాభట్, అజయ్‌దేవ్‌గన్ ఈ సినిమాలో కీలక పాత్రలను పోషిస్తున్నారు.

# చిత్రభాను

# ప్రతిసారి ఆ ఛాన్స్ వస్తుంది!



**గత చిత్రాలు అందించిన ఫలితాల తరువాత ఏ కథ విన్నా నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని చెప్పేయడం మొదలుపెట్టాను. నాకు ఒక కథ వంద శాతం సంత ృప్తిని కలిగిస్తేనే ఓకే చెబుతున్నాను. ఇకపై కూడా ఇలాగే వుండాలనుకుంటున్నాను అన్నారు సాయితేజ్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం చిత్రలహరి. కిషోర్ తిరుమల దర్శకుడు. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా హీరో సాయితేజ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.**

**పేరు మార్చుకున్నట్టున్నారు. ఏదైనా న్యూమరాలజీ ఫాలో అవుతున్నారా?**

అదేం లేదండీ. ఈ సినిమా నుంచి కూల్‌గా ప్రశాంతంగా వుండాలనుకున్నాను. పైగా చిత్రలహరి మంచి కథ అందుకే ఈ సినిమా నుంచి నా పేరుతో వున్న ధరమ్‌ను పక్కన పెట్టి సాయితేజ్‌గా మార్చుకున్నాను.

**సినిమాలో మీ పాత్ర ఎలా వుంటుంది?**

విజయ్‌క ృష్ణ తన జీవితంలో ఎప్పుడూ సక్సెస్‌ని చూడని వ్యక్తి. సక్సెస్ అంటే ఏంటో కూడా అతనికి తెలియదు. అలాంటి ఓ వ్యక్తి ప్రయాణమే ఈ చిత్ర కథ. తన ప్రయాణంలో అపజయాల్ని అధిగమించి విజయ్‌క ృష్ణ చివరికి సక్సెస్‌ని సాధించాడా? లేదా? అన్నది తెరపైన చూడాల్సిందే.

**గత అనుభవాల్ని ద ృష్టిలో పెట్టుకుని కథల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారా?**

కొన్ని ఫెయిల్ అవ్వొచ్చు, కొన్ని సక్సెస్ సాధించొచ్చు. అయితే ఫలితం ఎలా వున్నా పూర్తి బాధ్యతను మాత్రం నాపైనే వేసుకుంటాను. ఫ్లాప్ అయితే అది నేను చేసిన తప్పుగానే భావిస్తానే కానీ దాన్ని మరొకరిపై నెట్టేసే ప్రయత్నం చేయను.

**దర్శకుడిగా కిషోర్ తిరుమలకు, హీరోగా మీకు హిట్ లేదు. ఈ సినిమా విషయంలో ఏమైనా వొత్తిడికి గురవుతున్నారా?**

కథలో విషయం వుంటే సక్సెస్ ఎప్పుడైనా వస్తుంది. ఫెయిల్యూర్‌తోనే ఆగిపోతారు అనే నమ్మకం నాకు ఎప్పుడూ లేదు. ప్రతీ నటుడికి తనని తాను నిరూపించుకోవడం కోసం ప్రతి శుక్రవారం ఒక ఛాన్స్ వస్తుంటుందని బలంగా నమ్ముతాను.

**ఫ్లాప్‌ల వల్ల కథల ఎంపిక విధానంలో ఏమైనా మార్పులు వచ్చాయా?**

నేను నటించిన ఆరు చిత్రాలు వరుసగా పరాజయాన్ని చవిచూశాయి. అయితే ఫలితాల తరువాత ఏ కథ విన్నా నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని చెప్పేయడం మొదలుపెట్టాను. నన్ను ఒక కథ వంద శాతం సంత ృప్తిని కలిగిస్తేనే ఓకే చెబుతున్నాను. ఇకపై కూడా ఇలాగే వుండాలనుకుంటున్నాను.

**మొహమాటం కోసమే కొన్ని చిత్రాలు చేశారా?**

మొహమాటం అని కాదు కానీ కమిట్ అయ్యాను కాబట్టి చేశాను. నేను ఎవరికైనా మాటిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గను. నా కుటుంబం నన్ను అలా పెంచింది. మాటిస్తే అది ఎలా వున్నా దాని కోసం నిలబడతాను.

**దర్శకుడు కిషోర్ తిరుమల చిత్రలహరి కథ వినిపించినప్పుడు ఎలా అనిపించింది?**

ప్రధాన పాత్రల గురించి వివరిస్తూ కిషోర్ దీన్ని ఓ కథలా విను అని చెప్పాడు. చిత్రలహరి టైటిల్‌ని కూడా నాకు ముందు నుంచే చెప్పాడు. ఓ ఐదు పాత్రలు ఒక వ్యక్తి జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? అనే పాయింట్‌తో కథ వినిపించాడు. అప్పట్లో చిత్రలహరి అనే కార్యక్రమం ప్రతి శుక్రవారం చాలా మంది ఎదురుచూసేలా చేసింది. మా సినిమాలోనూ అంతే.

**కెరీర్‌లో ఫెయిల్ అయిన వాళ్లంతా చిత్రలహరిని తమ బయోపిక్‌గా భావిస్తున్నారు?**

ఆ మాటలు నేనూ విన్నాను. ట్విట్టర్‌లో నన్ను ఫాలోఅయ్యే చాలా మంది ఇది నా బయోపిక్‌లా వుందని అంటున్నారు. చిత్రలహరి ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే ఓ ఫేజ్. చాలా మంది ఏ అంశానికి కనెక్ట్ అయ్యారో నాకు అర్థం కాలేదు.

**సినిమాలో ప్లేట్ సక్సెస్ కావాలని ఓ డైలాగ్ వుంది. మీకు ఈ సినిమా ఎన్ని ప్లేట్‌ల సక్సెస్‌ని అందిస్తుంది?**

ప్లేట్ కాదు కానీ ఫుల్ మీల్స్‌లాంటి సక్సెస్ లభిస్తే చాలు. ఈ సినిమా విషయంలో కొరటాల శివ సహకారం చాలా వుంది. తప్పకుండా సినిమా సక్సెస్ సాధిస్తుందని కొరటాల శివ బలంగా నమ్మారు. అదే విషయాన్ని మాకు చెప్పారు. నిర్మాణ సంస్థ దగ్గరి నుంచి దర్శకుడు, నటీనటుల వరకు మా టీమ్ అంతా సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నాం. అయితే వ్యక్తిగతంగా ప్రతీ ఒక్కరికి తెలియకుండానే చిన్న భయం ఏర్పడింది. ఆ భయాన్ని కొరటాల శివ పోగొట్టే ప్రయత్నం చేశారు.

**యుఎస్ ట్రిప్‌కు ఎందుకు వెళ్లారు?**

నేను హేయిర్ సర్జరీ కోసమో లేక లైపో సెక్షన్ కోసమో యుఎస్ వెళ్లానని చాలా మంది అనుకున్నారు. అయితే విన్నర్ సినిమా సమయంలో గుర్రపు స్వారీ వల్ల నాకు చాలా దెబ్బలు తగిలాయి. అప్పట్లో నేను వాటిని పెద్దగా పట్టించుకోలేదు. తేజ్ ఐ లవ్‌యు సినిమా సమయంలో ఆ గాయాలు బాధించాయి. దాంతో ఫిజియో థెరపి కోసం యుఎస్ వెళ్లాల్సి వచ్చింది.

# రెండు మెదళ్లు ఉంటే..



ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం బుర్రకథ. డైమండ్ రత్నబాబు దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. దీపాల ఆర్ట్స్ పతాకంపై హెచ్.కె.శ్రీకాంత్ దీపాల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ ఫస్ట్‌లుక్‌ను గురువారం విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఒక మనిషికి రెండు మెదళ్లు ఉంటే ఎలా ఉంటుంది? అతని మానసిక ప్రవర్తన ఎలా సాగుతుంది? అనే ఆసక్తికరమైన అంశాన్ని వినోదప్రధానంగా ఈ సినిమాలో ఆవిష్కరించాం. వినూత్న కథాంశంతో తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది అన్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ వేసవిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అన్నారు.

మిస్తీ చక్రవర్తి, నైరాషా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, పోసాని క ృష్ణమురళి తదితరులు ఇతర ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి.రాంప్రసాద్, స్క్రీన్‌ప్లే: ఎస్.కిరణ్, సయ్యద్, ప్రసాద్ కామినేని, సురేష్ ఆరపాటి, దివ్యభవాన్, రచన-దర్శకత్వం: డైమండ్ రత్నబాబు.

## ఓట్లు కొన్నారు
# వీధి రౌడీల్లా వ్యవహరించారు

- అచ్చెన్నాయుడు, గంటాల రిగ్గింగ్
- ఏపీ సీఎం చంద్రబాబుపై 'దాడి' ధ్వజం



విశాఖపట్నం: ఎన్నికల సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు పదవీ వ్యామోహం మరోసారి వెల్లడైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓట్లు కొనేందుకు ప్రభుత్వ డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఆరోపించారు. చంద్రబాబు వీధి రౌడీలా వ్యవహరించారని, అధికారం ఉందని ఎన్నికల అధికారులను దబాయించారని దుయ్యబట్టారు. ఓటమి భయంతోనే అసహనానికి గురయ్యారని మండిపడ్డారు. 50 లక్షల మంది ఓట్లను ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు తొలగించారన్నారు.

చంద్రబాబు వెన్నుపోటు చరిత్ర కనబడకుండా ఆయనను హీరోగా ప్రాజెక్ట్ చేస్తూ రెండు సినిమాలు తీయించారని తెలిపారు. ఆ సినిమాలను కూడా ప్రజలు ఆదరించలేదన్నారు. బావ చాటు బాలయ్య ఈ సినిమాలు తీసి భంగపడ్డారని ఎద్దేవా చేశారు. తన వెన్నుపోటు చరిత్ర బయటపడుతుందన్న భయంతో రాంగోపాల్ వర్మ తీసిన సినిమా విడుదల కాకుండా చంద్రబాబు అడ్డుపడ్డారన్నారు. టీడీపీ నాయకులు పచ్చ చొక్కాలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అమ్మా, అయ్యా అంటూ ఓట్లు అడిగారని తెలిపారు. అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు రిగ్గింగ్‌కు ప్రయత్నించారని ఆరోపించారు.

**జనసేన-టీడీపీ కుమ్మక్కు**

జనసేన అభ్యర్థులంతా రాష్ట్రవ్యాప్తంగా చివరి నిమిషంలో టీడీపీకి సహకరించారని వెల్లడించారు. గాజువాకలో పవన్ కళ్యాణ్‌ను గెలిపించేందుకు టీడీపీ అభ్యర్థి సహకరించారని ఆరోపించారు. విశాఖలో బాలకృష్ణ చిన్నల్లుడు, టీడీపీ అభ్యర్థి శ్రీభరత్‌ను పక్కనపెట్టి జనసేనకు సహకరించమని నారా లోకేశ్ సూచించారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు సంయమనంతో వ్యవహరించారని ప్రశంసించారు. మార్పు తీసుకొస్తున్నామన్న భావన ఓటర్ల ముఖాల్లో కనిపించిందని దాడి వీరభద్రరావు అన్నారు.

# మే 23న చంద్రబాబు మాజీ కావటం ఖాయం..

## వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి అంబటి వ్యాఖ్య



విజయవాడ: టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ రౌడీయిజం చేసిందని ఆయన అన్నారు. పోలింగ్ పెరుగుదల ప్రభుత్వ వ్యతిరేకతను చాటి చెబుతోందని, అందుకే బాబుకు ఓటమి భయం పట్టుకుందన్నారు. మే 23న చంద్రబాబు మాజీ కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

అంబటి రాంబాబు శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...సాక్షాత్తు చంద్రబాబు ఈసీ అధికారినే బెదిరించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కొనేశారని మతి లేకుండా మాట్లాడుతున్నారు. ఈవీఎంలు సరిగా పనిచేయలేదని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఈవీఎంలు పని చేయకపోతే పోలింగ్ శాతం ఎలా పెరిగింది.

చంద్రబాబు కుట్ర భగ్నమైందనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారం పోతుందన్న ఆలోచనే చంద్రబాబును భయపెడుతుంది. ఆయనకు గెలుస్తామన్న విశ్వాసం ఉంటే భయమెందుకు?. ఓటమి భయంతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేయాలని చూస్తున్నారు. చాలాచోట్ల మా పార్టీ నేతలపై టీడీపీ నేతలు దాడులు చేశారు. టీడీపీ నేతలే దాడులు చేసి తిరిగి మాపైనే నెడుతున్నారు. కోడెల శివప్రసాదరావుపై మా పార్టీ కార్యకర్తలు దాడి చేయలేదు.

కోడెల పోలింగ్ కేంద్రాన్ని క్యాప్చరింగ్ చేసే వ్యక్తి. క్రిమినల్ మైండ్‌తో రాజకీయాలు చేయడం కోడెలకు అలవాటు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎవరైనా తలుపులు వేసుకుంటారా?. బూత్‌లోకి వెళ్లి దౌర్జన్యం చేశారు కాబట్టే ప్రజలు తిరగబడ్డారు. ఇపుడు బాబు మాజీ అని పిలిపించుకుంటారు.

## సరికొత్త ఇంజనీరింగ్ కోర్సుకు
# టిసిఎస్ రూపకల్పన

## గీతం 'వర్సిటీలో అమలుకు అవగాహన ఒప్పందం



సాగర్‌నగర్: సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ఐటి రంగ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రముఖ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) కంప్యూటర్ సైన్స్ బిజినెస్ సిస్టమ్స్ (సిఎస్‌బిఎస్) కోర్సుకు రూపకల్పన చేసింది. టిసిఎస్ సంస్థ అకడమిక్ నిపుణుల బృందం రూపొందించిన ఈ సిఎస్‌బిఎస్ కోర్సును 2019 విద్యా సంవత్సరం నుంచి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించడానికి శుక్రవారం టిసిఎస్ సంస్థ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసింది. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, హైదరాబాద్ ప్రాంగణం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్. శివప్రసాద్ సమక్షంలో టిసిఎస్ అకాడమిక్ ఇంటర్ ఫేస్ ప్రోగ్రామ్ అధిపతి చంద్ర కోడూరు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులకు శిక్షణ ఇవ్వడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. టిసిఎస్ అకాడమిక్ ఇంటర్ ఫేస్ ప్రోగ్రామ్ అధిపతి చంద్ర కోడూరు మాట్లాడుతూ తాము రూపొందిచిన సిఎస్‌బిఎస్ కోర్సును ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) ఆమోదించిందన్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సంస్థలో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు. కోర్సు సిలబస్ పై అధ్యాపకులకు శిక్షణ, విద్యార్థులకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ తమ్మిరెడ్డి, గీతం సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సొల్యూషన్స్ డైరక్టర్ గోపాల్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ
# ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్



హైదరాబాద్: త్వరలోనే పదవీకాలం ముగుస్తున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్ర ఎన్నికల సంఘం కూడా తెలంగాణ రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు పూర్తయిన తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపింది.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులతో శుక్రవారం చర్చించారు. ఈ నెల 22 నుంచి మే 14 వరకు జిల్లా, మండల పరిషత్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది. అయితే ఫలితాలను మాత్రం లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాతే ప్రకటిస్తారు.

## ధనవంతుల కోసమే
# న.మో. పనిచేస్తున్నారు



**రాహుల్ విమర్శ**

కృష్ణగిరి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకు పడ్డారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని కృష్ణగిరిలో పర్యటిస్తున్న రాహుల్.. మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ ఇలా తన 15 మంది స్నేహితుల కోసమే మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని దుయ్యబట్టారు.

కృష్ణగిరిలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా మోదీ 15 మంది కోసమే ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. వారు అనిల్ అంబానీ, మెహుల్ ఛోక్సీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా తదితరులు. వీరంతా మోదీకి స్నేహితులు. వీరంతా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని దేశం విడిచి పారిపోయారు. ధనవంతులు రుణాలు ఎగ్గొట్టినా జైల్లో వేయట్లేదు. రైతులను మాత్రం జైళ్లలో పెడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏ రైతుకూ జైలు శిక్ష పడదు అని రాహుల్ చెప్పుకొచ్చారు.

# దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయానికి పవన్ భారీ విరాళం



పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామిని శుక్రవారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు.

ఆలయానికి విచ్చేసిన జనసేనానికి ధర్మకర్తలు లింగమనేని పూర్ణభాస్కర రావు, వెంకట సూర్య రాజశేఖర్, రమేష్ ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం పవన్ వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి నిత్యాన్నదానం కోసం పవన్ రూ.1.32 కోట్లు చెక్కును విరాళంగా ధర్మకర్తలకు అందజేశారు. అనంతరం ఆలయంలో అన్నదానాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాద వితరణ గావించారు. పవన్ వెంట జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, అంజిబాబు తదితరులు ఉన్నారు.

## ఘనంగా హజ్రత్ మౌలాలీ , హజ్రత్ ఖాదర్ వలి
# చందనోత్సవ వేడుకలు



కంచరపాలెం : జీవీఎంసీ 40 వ వార్డు పరిధి మర్రిపాలెం మస్జిద్ వీధి వద్ద హజ్రత్ మౌలాలీ , హజ్రత్ ఖాదర్ వలి చందనోత్సవ వేడుకలు కోలనీ వాసులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మస్జిద్ -ఈ -అల్ ఫత్ ప్రాంగణంలో ముస్లిం సోదరులు ఖురాన్ పఠించారు .

మర్రిపాలెం పరిశర ప్రాంతల్లో చందనోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాత్రి 10 గంటలకు కోలని వద్ద నున్న హజ్రత్ మౌలాలీ, హజ్రత్ ఖాదర్ వలి నిషాని వద్ద ఫతీహా నిర్వహించారు .

శనివారం రాత్రి 9 గంటలకు ప్రముఖ టీవి సింగర్స్ రాజా హాసన్ , సనాం సాహెబా వారిచే ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలియజేశారు.

కార్యక్రమంలో ఉర్స్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గున్నారు.

# సెమీస్‌లో పీవీ సింధు

సింగపూర్: సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు తేజం పీవీ సింధు సెమీస్‌లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధు 21-13, 17-21, 21-14 తేడాతో యాన్యాన్(చైనా)పై విజయం సాధించి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. తొలి గేమ్‌ను సింధు అవలీలగా గెలవగా, రెండో గేమ్‌లో యాన్యాన్ పుంజుకుంది. ఫలితంగా రెండో గేమ్‌లో సింధుకు ఓటమి తప్పలేదు. కాగా, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు జోరును కొనసాగించింది.

మూడో గేమ్‌లో తన జోరును కొనసాగించిన సింధు వరుసగా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఇదే ఊపును కడవరకూ కొనసాగించి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకుంది.

ఇక మరో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సైనా నెహ్వాల్ ఓటమి పాలైంది. సైనా నెహ్వాల్ 8-21, 13-21 తేడాతో ఒకుహరా(జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది.

ఏ దశలోనూ ఒకుహరాకు పోటీ ఇవ్వని సైనా నెహ్వాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. శనివారం జరుగనున్న సెమీ ఫైనల్లో పీవీ సింధుతో ఒకుహరా తలపడనుంది.

# ప్రపంచకప్‌లో విరాట్ ప్రదర్శనపై ఆందోళన వద్దు



దిల్లీ: ఐపీఎల్ 12లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేలవ ప్రదర్శన ప్రభావం ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీపై ఉండదని ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్‌హగ్ అన్నాడు. ప్రతి పనిపై వ్యక్తిగతంగా అతడు ప్రత్యేక దృష్టి సారిస్తాడని పేర్కొన్నాడు. నిరంతరం విజయాన్నే కోరుకుంటాడని తెలిపాడు.

ప్రపంచకప్‌లో అతనెలా ఆడతాడోనని విచారపడొద్దని అభిమానులకు సూచించాడు. విరాట్ సారథ్యంలోని బెంగళూరు ప్రస్తుత సీజన్‌లో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఇంకా ఆ జట్టు గెలుపు బోణీ కొట్టలేదు.

విరాట్, ఏబీడీపై బెంగళూరు అతిగా ఆధారపడుతోంది. వారి మిడిలార్డర్ అనుకున్నంతగా రాణించడం లేదు. డెత్ ఓవర్లలో వారి బౌలింగ్ పేలవం. ప్రణాళికలను అనుకున్న విధంగా వారెప్పుడూ అమలు చేయలేదు. ఎప్పుడైె సరైన ప్రణాళికలు రచించలేదు. కాబట్టి ఆ ఫ్రాంచైజీ యాజమాన్యం త్వరగా చర్చించి పరిస్థితుల్లో మార్పు తేవాలి అని బ్రాడ్‌హగ్ అన్నాడు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com